# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 214, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజిలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం -29 - నవంబర్ - 2024

Published From, Srikakulam : Circulated at,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool , Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఏపీపై : రానున్న మూడ్రోజులు అతి భారీవర్షాలు

### ఫెంగల్ తుపాను ఎఫెక్ట్



అమరావతి, : నైరుతి బంగాళా ఖాతం లోని తీవ్ర వాయుగుండం బుధ వారం రాత్రికి తుపానుగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ తెలి పింది. ఆ తదుపరి 2 రోజులలో శ్రీలంక తీరాన్ని దాటి తమిళనాడు తీరం వైపు వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది.

## ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు కన్నుమూత



: ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా రికార్డు సృష్టించిన జాన్ ఆల్ఫ్రెడ్ టిన్నిస్ వుడ్ ఇంగ్లండ్‌లో కన్నుమూశారు. ఆయన వయస్సు 112 సంవత్సరాలు. మూడు నెలల క్రితమే ఆయన 112వ జన్మ దినం జరు పుకున్నారు.1912 ఆగస్టు 26న వాయవ్య ఇంగ్లాండ్ లో లివర్ పూల్ లో టిన్నిస్ వుడ్ జన్మించారు.

## మొన్న విదేశాల్లో ఐటీ ఉద్యోగి - ఇప్పుడు రోడ్లపై బిచ్చగాడిగా..



బెంగుళూరు,(ఇన్‌స్టాగ్రామ్) :అతడు ఒకప్పుడు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆ తర్వాత భారత్‌కు వచ్చి కూడా మంచి కంపెనీలో పనిచేశాడు. లక్షల్లో జీతాన్ని సంపాదించాడు. అయితే కొన్ని ఏళ్లు తిరిగేసరికే.. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సూటు బూటు వేసుకుని ఏసీ కింద కంప్యూటర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకోవాల్సిన ఆ వ్యక్తి..

## 2025 నాటికి భారతదేశ నీటి సంక్షోభం



### స్మార్ట్ మీటర్లు ఓ గేమ్ ఛేంజర్

న్యూఢిల్లీ : గ్లోబల్ వార్మింగ్ భారతదేశ నీటి భద్రత లక్ష్యాలపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది. భారత వాతావరణ శాఖ పరిశోధనలు ప్రకారం 2023 అత్యంత వేడి సంవత్సరాల్లో ఒకటిగా నివేదించింది. ఉష్ణోగ్రతలు దీర్ఘకాలిక సగటు కంటే 0.65 డిగ్రీలు పెరుగుతున్నాయి. ఈ వేడెక్కుతున్న ధోరణి అస్థిరమైన రుతుపవనాల నమూనాలు, నీటి వనరుల వేగవంతమైన బాష్పీభవనం, పెరుగుతున్న సముద్ర మట్టాల కారణంగా తీరప్రాంత జలాశయాలపై ఒత్తిడి పెరగడం వంటి సవాళ్ల శ్రేణిని ప్రేరేపించింది.భారతదేశ నీటి సంక్షోభం ఒక పతాక స్థాయికి చేరుకుంది, ఇది దేశ భవిష్యత్తుకు గణనీయమైన సవాళ్లను విసురుతోంది. నీటి వనరులను భద్రపరచడానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవలి నీతి ఆయోగ్ అధ్యయనాల ప్రకారం దిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి మిగతా..2లో

# గంజాయి విక్రయిస్తే సంక్షేమ పథకాలు కట్



- ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం
- గంజాయి నిర్మూలనకు సరికొత్త వ్యూహం
- యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్ పేరును 'ఈగల్'
- సమూలంగా ధ్వంసం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ఏపీలో గంజాయి అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గంజాయి విక్రయించే వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ కు ఈగల్ అని నామకరణం చేశారు.పాఠశాలలు, కాలేజీలు, సచివాలయాల పరిధిలో 10 మందితో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈగల్ కమిటీల్లో మహిళా సంఘాలు, ఆశా వర్కర్లలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

అమరావతి . : అమరావతి సచివాలయంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన బుధవారం ఏపీ కేబినెట్ మిగతా..2లో



2లో

## ఎర్ర చందనం అమ్మకాలు, ఎగుమతికి సింగిల్ విండో విధానం మేలు

న్యూఢిల్లీ : ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని, దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే 'ఈ - వేలం'లో మెరుగైన ఫలితాలు వస్తాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కి తెలియచేశారు. దేశ రాజధాని ఢిల్లీలో పర్యటిస్తున్న పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం భూపేంద్ర యాదవ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎర్రచందనం రక్షణ, స్మగ్లింగ్ నిరోధం, దుంగల అమ్మకం విషయంలో అనుసరిస్తున్న విధానాల మీద కేంద్ర మంత్రితో చర్చించారు.

## పీలో 'స్వర్ణ పంచాయతీ'.. 13,326 పంచాయతీల్లో డిజిటల్ సేవలు




అమరావతి,కోస్తా లీడర్ ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను పేమెంట్స్ ఆన్‌లైన్ అయ్యాయి. రాష్ట్రంలోని గ్రామాల్లో ఉన్న దాదాపు 88 లక్షల ఇళ్లు, దుకాణాలు, భవనాల సమగ్ర సమాచారాన్ని 'స్వర్ణ పంచాయతీ' పేరుతో ప్రత్యేక పోర్టల్‌లోకి తీసుకొచ్చారు. జనవరి నుంచి రాష్ట్ర ప్రజలు తమ ఇళ్లు, భవనాల అసెస్‌మెంట్ నంబరును ప్రత్యేక పోర్టల్‌లో ఎంటర్ చేసి.. ఆస్తి పన్ను బకాయిల సమాచారాన్నిచూసుకొని ఆన్‌లైన్‌లో పేమెంట్ చేయొచ్చు. ఆస్తిపన్ను వసూళ్ల కోసం 5వేల పెద్ద పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులతోనూ మిగతా..2లో



## నాగబాబు కు ఎంపీ పోస్ట్ ఫిక్స్..?

విజయవాడ : మెగా బ్రదర్ నాగబాబు తన తమ్ముడు పవన్ కళ్యాణ్‌కి రాజకీయాల్లో అండగా ఉంటూ వస్తున్నారు. తనకంటూ ఏమి ఆశించకుండా కేవలం తమ్ముడు కోసం పని చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే కూటమి ఏర్పాటు చేయడం కోసం, తన తమ్ముడు కోసం.. సీటుని కూడా త్యాగం చేసారు. తనకి సీటు ఇవ్వకపోయినా పవన్ కోసం.. ఈ ఎన్నికల్లో ఎంతో కష్టపడ్డారు. తాను మాత్రమే కాదు, తన భార్య పద్మజని, కొడుకు వరుణ్ తేజ్ కి కూడా తీసుకొచ్చి ప్రచారం చేయించారు.

# ప్రధానమంత్రి మోదీతో పవన్ భేటీ

2లో

### ఆసక్తికరంగా డిప్యూటీ సీఎం పవన్ ఢిల్లీ టూర్

### జలజీవన్ మిషన్ అమలు, ఏపీకి నిధులపై చర్చ

### తొలిసారి ఢిల్లీలో ప్రధానితో పవన్ భేటీ ప్రాధాన్యత



ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఢిల్లీ టూర్ కొనసాగుతోంది. బుధవారం పార్లమెంటు భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో మోదీతో భేటీ అయ్యారు. జలజీవన్ మిషన్ నిధులతో పాటు ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అంతేకాకుండా పలువురు కేంద్రమంత్రులతో పవన్ సమావేశమయ్యారు.

న్యూఢిల్లీ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. నిన్న పలువురు కేంద్ర మంత్రులను కలవగా.. ఇవాళ ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు.ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు.

## వచ్చే నెల 4న శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ సి.59 రాకెట్ ప్రయోగం



అమరావతి : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వచ్చే నెల 4న ఏపీలోని తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ సి.59 రాకెట్ ప్రయోగించనుంది. 4న సాయంత్రం 4.08 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. శ్రీహరికోట షార్ లోని ప్రయోగ వేదికకు సంబంధించిన మొబైల్ సర్వీస్ టవర్ లో పీఎస్ఎల్వీ సీ59 రాకెట్ అనుసంధానం పనులు చురుకుగా జరుగుతున్నాయి. సీ59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోభా-3 అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు చిన్నతరహా ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించనున్నారు. డిసెంబర్ 24న పీఎస్ఎల్వీ సీ60 మరో రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా రిశాట్-1బీ అనే ఉపగ్రహంతో పాటు మరో నాలుగు వాణిజ్యపరమైన ఉపగ్రహాలను ప్రయోగించబోతున్నారు.

# ప్రధాని మోదీ ముందుకు మహారాష్ట్ర సీఎం పంచాయితి..!

## మోదీ మాటే ఫైనల్ అన్న షిండే

## నేనెప్పుడూ సామాన్యుడినే..



న్యూఢిల్లీ : ప్రధాని మోదీ నిర్ణయమే ఫైనల్ అని, ఆ నిర్ణయాన్ని తామంతా అంగీకరిస్తామని ఏక్ నాథ్ షిండే చెప్పారు. ముంబైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏక్ నాథ్ షిండే మాట్లాడుతూ ప్రధాని మోదీ తమ కుటుంబ పెద్ద అని అన్నారు.అయితే మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. దేవేంద్ర ఫడణవీస్ (బీజేపీ), ఏక్ నాథ్ షిండే (శివసేన) ల మిగతా..2లో

### తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక గాంధీ..

## వయనాడ్ ఎంపీగా ప్రమాణం

**ప్రియాంక తన తల్లి, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ, సోదరుడు, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి పార్లమెంట్‌కు రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు**

ఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత ప్రియాంకా గాంధీ వయనాడ్ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ప్రియాంక తన తల్లి, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ, సోదరుడు, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి పార్లమెంట్‌కు చేరుకున్నారు. లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ఆమెతో ప్రమాణం చేయించారు. పోడియం వద్దకు వెళ్లిన ప్రియాంక.. ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టిన ప్రియాంక.. చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సోనియా, రాహుల్‌తోపాటు.. ప్రియాంక పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇంతకాలం పార్టీ ప్రచారాలకే పరిమితమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష



రాజీకాయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తన సోదరుడు రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో పోటీ చేసి రికార్డు మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. శనివారం వెలువడిన ఫలితాల్లో ఆమె 4.8 లక్షల ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 3.64 ఓట్లతో ఉన్న రాహుల్ పేరుతో ఉన అత్యధిక మెజార్టీ రికార్డును ఆమె తుడిచివేశారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

శుక్రవారం- 29 - నవంబర్ - 2024

# ప్రధానమంత్రి మోదీతో పవన్ భేటీ

మొదటి పేజి తరువాయి

నిన్న పలువురు కేంద్ర మంత్రులను కలవగా.. బుధవారం ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు.పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో మోదీతో పవన్ సమావేశమయ్యారు. జలజీవన్ మిషన్ అమలు, ఏపీకి నిధులపై చర్చించారు. ఇటీవలే వచ్చిన ఎన్నికల ఫలితాలతో పాటు ఏపీ రాజకీయాలపై వీరద్దరి భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఏపీకి కేంద్రం చేస్తున్న సాయానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు.డిప్యూటీ సీఎం హోదాలో పవన్ ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితం ఆయన ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. తొలిసారి ఢిల్లీలో ప్రధానితో పవన్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ప్రస్తుత పర్యటనలో వరుసగా పలువురు కేంద్రమంత్రులను కలిశారు. ఇవాళ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ ను పలువురు ఎంపీలు కలిశారు. ఏపీ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న పురందేశ్వరితో కాసేపు మాట్లాడారు.పలు రాష్ట్రాల ఎంపీలతో కూడా పవన్ కల్యాణ్ కాసేపు ముచ్చటించారు.

## మొన్న విదేశాల్లో ఐటీ ఉద్యోగి- ఇప్పుడు రోడ్లపై బిచ్చగాడిగా..

మొదటి పేజి తరువాయి

నడిరోడ్డుపైకి వచ్చేశాడు. పెరిగిన జుట్టు, మాసిన గడ్డం.. చిరిగిపోయిన బట్టలతో బిచ్చగాడిలా మారిపోయాడు. అయితే అతడిని కలిసి మాట్లాడిన ఓ యువకుడు.. సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేయడంతో ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.శరత్ యువరాజా అనే ఓ యువకుడు తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి.. ఇప్పుడు కర్ణాటక రాజధాని బెంగళూరులోని రోడ్లపై బిచ్చం ఎత్తుకుంటూ కనిపించగా.. అతడితో మాట్లాడిన శరత్ యువరాజా ఆ వీడియోను పోస్ట్ చేశాడు. ఒకప్పుడు జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో.. ఆ తర్వాత బెంగళూరులో ఓ ప్రముఖ టెక్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసిన ఆ టెకీ.. ఇప్పుడు అదే బెంగళూరు నగరంలోని జయనగర్ వీధుల్లో భిక్షాటన చేస్తున్నాడు. అయితే తాను ఇలా కావడానికి కారణం.. మద్యానికి బానిస కావడమేనని తేల్చి చెప్పాడు.ఇక ఆ వీడియోలో అతడు.. ఐన్‌స్టీన్ నుంచి మొదలుపెడితే ఎంతోమంది తత్వవేత్తల వరకు అందరి గురించీ ఇంగ్లీష్‌లో నాన్‌స్టాప్‌గా మాట్లాడుతూనే ఇన్నాడు. అంతేకాకుండా ధ్యానం, తత్వశాస్త్రం, సైన్స్ వంటి సబ్జెక్టులపై ఎంతో పట్టు ఉన్న వ్యక్తిలాగా మాట్లాడుతున్నాడు. అయితే తన తల్లిదండ్రులు చనిపోయారని.. అప్పటి నుంచి మద్యానికి బానిస అయి.. ఇలా తయారైనట్లు చెప్పుకొచ్చాడు. తనను కనిపెంచిన తల్లిదండ్రులను కోల్పోవడంతో తాను తట్టుకోలేక మద్యం వైపు అడుగులు వేసినట్లు చెప్పాడు.అయితే తాను ఇంకా చదుకోవాలి అని ఆ టెకీ మరో వీడియోలో చెప్పడం గమనార్హం. అయితే తాను సాయం చేయడానికి ప్రయత్నించినా.. అతడు నిరాకరించినట్లు శరత్ యువరాజా వెల్లడించాడు. అతడ్ని చూసి ఎన్జీవోలను సంప్రదించినా.. వారు పోలీసుల ప్రమేయంతోనే అతన్ని మార్చడం సాధ్యమని డాక్టర్లు అంటున్నారని చెప్పాడు. ఇక ఆ వీడియోలో నువ్వు ఏం చదువుకున్నావని శరత్ యువరాజా అడగ్గా.. తాను ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని.. తాను గ్లోబల్ విలేజ్‌లోని మైండ్‌ట్రీలో పని చేసినట్లు చెప్పాడు.

## ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడు కన్నుమూత

మొదటి పేజి తరువాయి

2024 నవంబర్ 25న అదే లివర్ పూల్ సమీపంలోని ఒక సంరక్షణ గృహంలో ఆయన సోమవారం మరణించారు. తన దీర్ఘాయువుకు కారణం కేవలం అదృష్టమేనని టిన్నిస్ వుడ్ గతంలో చెప్పారు. 2024 ఏప్రిల్ నెలలో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారు అతడికి ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడిగా గుర్తించి, ధ్రువీకరణ పత్రం అందించారు. ఆ సందర్భంగా టిన్నిస్ వుడ్ మాట్లాడుతూ, ఎక్కువ కాలం జీవించడం లేదా తక్కువ కాలం జీవించడం అనేది మన చేతిలో లేదని వ్యాఖ్యానించారు." అయితే, ఆరోగ్యకరమైన జీవితానికి సంయమనం కీలకమని ఆయన అన్నారు. టిన్నిస్ వుడ్ ఎప్పుడూ ధూమపానం చేయలేదు. అరుదుగా మద్యం సేవించేవాడు. ప్రతి శుక్రవారం చేపలు, చిప్స్ తినడం మినహా ప్రత్యేకమైన ఆహారాన్ని అనుసరించలేదు. బ్రిటిష్ ఆర్మీ నుంచి రిటైర్ అయిన తరువాత ఆయన అకౌంటెంట్ గా పని చేశారు. టిన్నిస్ వుడ్ కు ప్రస్తుతం ముత్తాత హోదా కూడా ఉంది."మీరు ఎక్కువగా తాగితే లేదా మీరు ఎక్కువగా తింటుంటే లేదా మీరు ఎక్కువగా నడిచినట్లయితే – మీరు ఏదైనా ఎక్కువగా చేస్తే – మీరు చివరికి బాధపడతారు" అని టిన్నిస్ వుడ్ చెప్పారు. టైటానిక్ మునిగిన కొన్ని నెలల తర్వాత టిన్నిస్ వుడ్ జన్మించాడు. అతను రెండు ప్రపంచ యుద్ధాలను చూశాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ ఆర్మీ పే కార్ప్స్ లో పనిచేశాడు. వెనిజులాకు చెందిన జువాన్ విసెంటే పెరెజ్ 114 ఏళ్ల వయసులో మరణించడంతో, ఆయన అనంతరం టిన్నిస్ వుడ్ ప్రపంచంలో అత్యంత వృద్ధుడి ఘనత సాధించాడు. ఆయనకు కుమార్తె సుసాన్, నలుగురు మనవరాళ్లు, ముగ్గురు మనుమలు ఉన్నారు. 44 ఏళ్ల వయస్సులో ఆయన భార్య బ్లోడ్వెన్ 1986లో మరణించారు. కాగా, జపాన్ కు చెందిన 116 ఏళ్ల టోమికో ఇటుకా ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా రికార్డు సృష్టించారు.

## నాగబాబు కు ఎంపీ పోస్ట్ ఫిక్స్..?

మొదటి పేజి తరువాయి

పవన్ కోసం పిఠాపురం నియోజకవర్గంలో పద్మజ ఎంతో కష్టపడ్డారు. ఇలా తన కోసం అన్న నాగబాబు చేసిన కష్టానికి తమ్ముడు ప్రతిఫలం అందించబోతున్నట్లు తెలుస్తుంది. నాగబాబు కు ఎంపీ పోస్ట్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తుంది.ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. డిసెంబర్ 3 నుంచి 10 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఎన్నిక అనివార్యమైతే డిసెంబర్ 20న పోలింగ్ జరగనుంది. వైసీపీ నుంచి రాజ్యసభ ఎంపికైన మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్యలు తమ పదవులకు రాజీనామా చేయడంతో మూడు సీట్లు ఖాళీ అయ్యాయి. అసెంబ్లీలో ప్రస్తుతం వైసీపీకి కేవలం 11 మంది సభ్యులు మాత్రమే ఉన్నారు. దీంతో మూడు రాజ్యసభ సీట్లు కూటమికే దక్కనున్నాయి. మూడింటిలో ఒకటి జనసేనకు ఇవ్వాలని.. అది నాగబాబుకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఢిల్లీ లో బిజీ బిజీ గా ఉన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు , పెండింగ్ బకాయిలు, రాష్ట్రానికి ఏంచేస్తే బాగుంటుందనే అంశాల పట్ల కేంద్ర మంత్రులతో , ప్రధాని మోడీ తో సమావేశమయ్యారు.

## పీలో 'స్వర్ణ పంచాయతీ'.. 13,326 పంచాయతీల్లో డిజిటల్ సేవలు

మొదటి పేజి తరువాయి

బకాయిలు చెల్లించొచ్చు. కొన్ని గ్రామపంచాయతీల్లో క్యూఆర్ కోడ్‌తో పన్ను బకాయిలు కట్టొచ్చు. ప్రజల నుంచి వసూలుచేసే మొత్తాలు నేరుగా గ్రామ పంచాయతీల పీడీ ఖాతాల్లో జమ అవుతాయి. వ్యాపార లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణపత్రాల సేవలను కూడా ఆన్‌లైన్‌లోనే పొందొచ్చు.జనవరి నుంచి 'స్వర్ణ పంచాయతీ' పోర్టల్ ప్రారంభం అవుతుంది. అయితే తొలిదశలో గ్రామ పంచాయతీల్లో ముఖ్యమైన సేవలు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ఈ సేవల జాబితాలో ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్సులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణపత్రాలు, భవన నిర్మాణ అనుమతులు ఉంటాయి. తదుపరిగా విడతలవారీగా మొత్తం 80 రకాల సేవలను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో అందుబాటులో తీసుకొస్తారు. వాస్తవానికి గతంలో అధికారంలో ఉన్నప్పుడే ఈ పోర్టల్‌ను ప్రారంభించాలని టీడీపీ యోచించింది. దాని నిర్వహణ బాధ్యతలను అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్(ఎన్‌ఐసీ)కు అప్పగించారు. అయితే వైఎస్సార్ సీపీ సర్కారు ఏర్పడిన తర్వాత ఎన్‌ఐసీకి నిధుల కేటాయింపును ఆపేశారు. దీంతో ఈ పోర్టల్ నిర్వహణ ఆగిపోయింది.ఇప్పుడు మళ్లీ టీడీపీ సర్కారు రావడంతో స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ, సేవల సంస్థకు అప్పగించారు.

## ఎర్ర చందనం అమ్మకాలు, ఎగుమతికి సింగిల్ విండో విధానం మేలు

మొదటి పేజి తరువాయి



పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రి దృష్టికి ఈ విషయాలు తీసుకువచ్చారు. "బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ఇటీవల ప్రతిపాదించిన ప్రకారం ఎర్రచందనం అమ్మకం, ఎగుమతి చేసే విషయంలో సింగిల్ విండో విధానం ఉంటే మేలు జరుగుతుంది. ఈ విధానానికి ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ కస్టోడియన్ గా వ్యవహరిస్తుంది. ఈ ప్రతిపాదనను పరిశీలించలరు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో ఎర్రచందనం గ్రేడింగ్, వేలం, ఎగుమతి సాగిస్తుంది. తద్వారా ఈ-వేలం ద్వారా రెవెన్యూ పెరుగుతుంది.

### ఏ రాష్ట్రంలో పట్టుబడినా...

ఎర్రచందనం అరుదైన వృక్ష సంపద. ఆంధ్ర ప్రదేశ్ అటవీ ప్రాంతంలోనే పెరుగుతుంది. ఈ క్రమంలో కేంద్రం నిబంధనలను సవరించి ఆంధ్రప్రదేశ్ వెలుపల పట్టుబడిన ఎర్రచందనం సైతం సింగిల్ విండో వేలంలో భాగం కస్టోడియన్ గా ఉండే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికే దక్కేలా చూడాలి. దీనివల్ల ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పట్టుబడిన ఎర్రచందనం అమ్ముకోవడానికి కుదరదు. అమ్మకాలు, ఎగుమతులు ఒకే విధానం ద్వారా కొనసాగుతుంది. కేంద్ర పర్యవేక్షణతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కస్టోడియన్ గా కొనసాగుతుంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# గంజాయి విక్రయిస్తే సంక్షేమ పథకాలు కట్

మొదటి పేజి తరువాయి




సబ్ కమిటీ సమావేశం జరిగింది. యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్ పేరును 'ఈగల్'గా మార్చడంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. టాస్క్ ఫోర్స్ విధివిధానాలతో పాటు కీలక నిర్ణయాల దిశగా సబ్ కమిటీ సమాలోచనలు జరిపింది. గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై జరిగిన మంత్రుల కమిటీ భేటీలో మంత్రి నారా లోకేశ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రులు సంధ్యారాణి, కొల్లు రవీంద్ర పాల్గొన్నారు.గంజాయి విక్రయాలకు చెక్ పెట్టేందుకు ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. గంజాయి అమ్మే వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు నిలిపివేయాలని

నిర్ణయించింది. నార్కోటిక్స్ నియంత్రణపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ బుధవారం భేటీ అయ్యింది. ఈ భేటీలో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. అలాగే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ కు ఈగల్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. పాఠశాలలు, కాలేజీలు, సచివాలయాల పరిధిలో 10 మందితో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈగల్ కమిటీల్లో మహిళా సంఘాలు, ఆశా వర్కర్లలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడంతోపాటు బాధితులను ఆ వ్యసనం నుంచి బయటపడేయడం, గంజాయి సాగు, మత్తుపదార్థాల విక్రేతల మీద కఠిన చర్యలు తీసుకోవడంపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాల అమలుకు యాంటీ నార్కోటిక్స్ ?టాస్క్?ఫోర్స్?ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ టాస్క్?ఫోర్స్ ?విధివిధానాలతోపాటు మరికొన్ని కీలక నిర్ణయాలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులు నిర్ణయించారు."గంజాయి విక్రయించే వారి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమం కట్. గంజాయి, డ్రగ్స్ పై ఇక యుద్ధమే. నిర్మూలనకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి ఉక్కుపాదం మోపాలి"- మంత్రి నారా లోకేష్ఉత్తరాంధ్ర జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టేందుకు పోలీసులు స్మార్ట్ వర్క్ చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో సాగు చేస్తున్న గంజాయిని అరికట్టేందుకు టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి సాగుదారుల ఆట కట్టిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి పంటను గుర్తించి ధ్వంసం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డ్రోన్లతో గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో 3. 55 ఎకరాల్లో సాగుచేస్తున్న గంజాయిని డ్రోన్ల సాయంతో గుర్తించి ధ్వంసం చేశారు. మూడు అడుగుల ఎత్తు మేర పెరిగిన గంజాయి మొక్కలను కనిపెట్టేలా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.డ్రోన్లలో హై డెఫినీషన్ ఫొటోలు తీసే మల్టీ స్పెక్ట్రల్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. గంజాయి మొక్కలను గుర్తించేందుకు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గూగుల్ సహాయం తీసుకుని గంజాయి సాగును గుర్తించనుంది. గంజాయిని సమూలంగా ధ్వంసం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని అధికారులు తెలిపారు.

# ప్రధానమంత్రి మోదీతో పవన్ భేటీ

మొదటి పేజి తరువాయి



మధ్య సీఎం పదవి విషయంలో గట్టిపోటీ నెలకొని ఉంది.కాగా, ఈ విషయంలో బుధవారం శివసేన నేత ఏక్ నాథ్ షిండే కొంత స్పష్టతనిచ్చారు. మహాయుతి కూటమి నుంచి ఎవరిని సీఎంగా ఎంపిక చేయాలనే నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి కూటమి నేతలు అప్పగించారు. ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ నాయకత్వం తనను అడ్డంకిగా భావించరాదని ఆయన అన్నారు. తన వల్ల మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు ఏదైనా సమస్య వస్తుందని ఎలాంటి సందేహం పెట్టుకోవద్దని, మీరు ఏ నిర్ణయం తీసుకున్నా ఆ నిర్ణయం తనకు ఆమోదయోగ్యమేనని ప్రధానికి చెప్పానని షిండే వెల్లడించారు. "నన్ను అడ్డంకిగా చూడొద్దని ప్రధాని మోదీకి, అమిత్ షాకు చెప్పాను. వారు ఏ నిర్ణయం తీసుకున్నా నేను కట్టుబడి ఉంటాను" అని చెప్పారు. మహారాష్ట్ర సీఎం పదవికి సంబంధించి బీజేపీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా తమ పార్టీ మద్దతు ఇస్తుందని షిండే చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిర్ణయానికి తను, శివసేన కట్టుబడి ఉంటుందని ఆయన చెప్పారు.తాను సామాన్యుడిగానే పనిచేశానని, తనను తాను ఎప్పుడూ ముఖ్యమంత్రిగా భావించలేదని షిండే అన్నారు. తాను నిరుపేద కుటుంబం నుంచి వచ్చానని, రాష్ట్ర ప్రజల బాధలు, కష్టాలను అర్థం చేసుకోగలనని, వారి కష్టాలు తీర్చడమే తన లక్ష్యమని చెప్పారు. ఒక సీఎంగా శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే, ప్రధాని మోదీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించానని చెప్పారు. "గత రెండున్నరేళ్లలో నేను చేసిన పనులతో చాలా సంతృప్తిగా ఉన్నాను. నేను కలత చెందే రకం కాదు. ప్రజల కోసం పోరాడే, పోరాడే వ్యక్తిని" అని ఆయన అన్నారు. ఏక్ నాథ్ షిండే బుధవారం మళ్లీ ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, అమిత్ షాలతో మహాకూటమి మిత్రపక్షాల సమావేశం కూడా జరగనుంది.కాగా, సీఎం పదవిపై ఏక్ నాథ్ షిండే వైఖరికి మహారాష్ట్ర బీజేపీ చీఫ్ చంద్రశేఖర్ బవాన్ కులే కృతజ్ఞతలు తెలిపారు. "ఆయన ఎప్పుడూ కేంద్ర నాయకత్వాన్ని గౌరవించారు. పాటించారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఇచ్చిన ప్రతి సూచనను ఆయన పాటించారు. ఆయన నిజమైన మహాకూటమి నాయకుడిగా వ్యవహరించారు. అందుకు ఆయనకు ధన్యవాదాలు, అభినందనలు" అన్నారు.మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధించిన తరువాత సీఎం పీఠం కోసం ఏక్ నాథ్ షిండే, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ఇద్దరూ పోటీ పడ్డారు. మరోవైపు, సంకీర్ణంలో చిన్న భాగస్వామిగా ఉన్నప్పటికీ నితీశ్ కుమార్‌ను బిహార్ ముఖ్యమంత్రిగా బీజేపీ కొనసాగించడాన్ని శివసేన (షిండే) వర్గం గుర్తు చేస్తోంది. అదే తరహాలో మహారాష్ట్రలో శివసేనకే ఈ పదవిని ఇవ్వాలని డిమాండ్ చేసింది. అయితే బిహార్ ఫార్ములా మహారాష్ట్రకు వర్తించదని బీజేపీ చెబుతోంది. "నితీష్ కుమార్ ను సీఎం చేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటన చేశారు. మహారాష్ట్రలో శివసేనకు అలాంటి హామీ ఏమీ ఇవ్వలేదు. కాబట్టి మహారాష్ట్రలో దీన్ని పునరావృతం చేసే ప్రసక్తే లేదు" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా తెలిపారు.

# 2025 నాటికి భారతదేశ నీటి సంక్షోభం

మెట్రోపాలిటన్ హబ్ లతో సహా 21 ప్రధాన నగరాల్లో 2025 నాటికి భూగర్భ జల వనరులు అంతరించే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఇది గణాంకాలే కాదు, తన భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవడానికి అత్యవసరంగా ప్రయత్నిస్తున్న దేశానికి మేల్కొలుపు పిలుపు. 2025 నాటికి భారతదేశం నీటి ఒత్తిడికి గురవుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తున్నందున, తలసరి నీటి లభ్యత ఏటా 1,000 క్యూబిక్ మీటర్ల కంటే తక్కువగా పడిపోతుంది. తక్షణ చర్య అవసరం.భారతదేశం వేగవంతమైన పట్టణీకరణ ప్రకృతి దృశ్యాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు సవాలు మరింత భయంకరంగామారుతుంది. 2030 నాటికి పట్టణ జనాభా 600 మిలియన్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. నగరాలు తమ నీటి నిర్వహణ వ్యూహాలను ప్రాథమికంగా మార్చుకోవాలి. కాలం చెల్లిన మౌలిక సదుపాయాలు, బలహీన పంపిణీ వ్యవస్థల ద్వారా వర్ణించిన ప్రస్తుత విధానం, వేగంగా అభివృద్ధి చెందుతున్న మన పట్టణ కేంద్రాల్లో పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి సరిపోదు.ఆర్థిక పరిణామాలు కూడా అంతే ఆందోళనకరంగా ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, ప్రస్తుత నీటి నిర్వహణ పద్ధతులు కొనసాగితే, వాతావరణ మార్పు 2050 నాటికి భారతదేశ జీడీపీ 2.8 శాతం తగ్గిపోవచ్చని సూచిస్తున్నాయి. పర్యావరణ, ఆర్థిక సవాళ్ల కలయిక తక్షణ, వినూత్న పరిష్కారాలను కోరుతుంది.పెరుగుతున్న ఈ సవాళ్లను పరిష్కరించడానికి, సాంకేతికతలు నీటి-సురక్షితమైన భారతీయ నగరాల కోసం సమగ్ర దృష్టిని అభివృద్ధి చేయాలి. ఇది సాంకేతిక పరిష్కారాలను మించి, పట్టణ నీటి నిర్వహణలో విప్లవాత్మక మార్పులకు అధునాతన సాంకేతికలను స్థిరమైన పద్ధతులతో అనుసంధానించే పరివర్తన విధానాన్ని అవలంభిస్తుంది. ఈ విజన్ లో ప్రధానమైనది గొప్ప మౌలిక సదుపాయాల విస్తరణ. అధునాత లీక్ డిటెక్షన్ సిస్టమ్ లు వాస్తవ-సమయ నీటి నాణ్యత పర్యవేక్షణతో పాటు పనిచేస్తాయి. అయితే ఒత్తిడి నిర్వహణ పరిష్కారాలు, ఆటోమేటెడ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ లు సరైన వనరుల వినియోగాన్ని నిర్ధారిస్తాయి. అయితే సాంకేతికత మాత్రమే సరిపోదు. నీటి డిమాండ్ నమూనాలను అంచనా వేయడానికి, పంపిణీ నెట్ వర్క్ లను ఆప్టిమైజ్ చేయడానికి, సిస్టమ్ వైఫల్యాలను ముందస్తుగా నిరోధించడానికి, చురుకైన, సమర్థవంతమైన నీటి నిర్వహణ వ్యూహాన్ని నిర్ధారించడానికి ఈ విధానం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగును తప్పనిసరిగా ఉపయోగించాలి.బహుశా ముఖ్యంగా, ఈ దృష్టి నిజమైన పరివర్తనకు చురుకైన సంఘం భాగస్వామ్యం అవసరమని గుర్తిస్తుంది. ప్రజా చైతన్య ప్రచారాలు, నీటి సంరక్షణ ప్రోత్సాహకాలు, సాధారణ కమ్యూనిటీ ఫీడ్‌బ్యాక్ సెషన్‌ల ద్వారా, సాంకేతికతలను ఒక ఉద్యమంలా నిర్మించడమే లక్ష్యం, కేవలం వ్యవస్థను అమలు చేయడం మాత్రమే కాదు, సమిష్టి బాధ్యత, దీర్ఘకాలిక స్థిరత్వాన్ని పెంపొందించడం కూడా అవసరం.పట్టణ నీటి నిర్వహణ ఆధునికీకరణలో అత్యంత ముఖ్యమైన అంశాలలో ఒకటి స్మార్ట్ వాటర్ మీటర్ల విస్తరణ. దీన్ని మొదటగా ప్రారంభించిన పూణే, బెంగళూరు వంటి నగరాలు ఆకట్టుకునే అద్భుతమైన ఫలితాలను చూశాయి. అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే, ఈ నగరాలు 15-20% నీటి ఆదాను నివేదించాయి, దానితో పాటు ఆదాయ పునరుద్ధరణలో 25% మెరుగుపడింది. పట్టణ నీటి నిర్వహణలో పునరావృతమయ్యే సమస్య అయిన రెవెన్యూయేతర నీటిలో 35% నుంచి 15%కి తగ్గడం మరింత విశేషమైనది. దక్షిణ ఢిల్లీలోని ఒక పైలట్ ప్రాజెక్ట్ 3,000 గృహాలను కవర్ చేస్తుంది, ఈ చౌరవ నీటి వినియోగంలో 18% తగ్గింపు, బిల్లుల సేకరణలో 32% మెరుగుదలని సాధించిందని బలమైన ఆధారాలు వున్నాయి. బహుశా చాలా స్పష్టంగా చెప్పాలంటే, రోజువారీ నీటి పొదుపు దాదాపు 500,000 లీటర్లకు చేరుకుంది. కస్టమర్ ఫిర్యాదులు 90% తగ్గాయి.నీటి భద్రతకు మార్గం, సవాలుగా ఉన్నప్పటికీ, సానుకూల మార్పు కోసం అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. భారతదేశంలోని ప్రధాన నగరాల్లో స్మార్ట్ మీటర్లను పూర్తిగా అమలు చేయడం ద్వారా వార్షికంగా 2.5 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి ఆదా అవుతుంది. పరిరక్షణకు మించి, ఈ విధానం పట్టణ వరదల సంఘటనలను 40% తగ్గించి నీటి పంపిణీలో 30% శక్తి పొదుపును సాధిస్తుందని వాగ్దానం చేస్తుంది. అదనంగా, నీటి సాంకేతిక రంగం వృద్ధి 100,000 కొత్త ఉద్యోగాలను సృష్టించగలదు.భారతదేశ నీటి నిర్వహణ నిర్ణయాలు నేడు దాని భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఈ క్లిష్ట సమయంలో, ఎంపిక మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రస్తుత పద్ధతులను కొనసాగించండి. తీవ్రమైన నీటి కొరతకు గురయ్యే ప్రమాదం ఉంది, లేదా స్థితిస్థాపక నగరాలను నిర్మించడానికి వినూత్న పరిష్కారాలను స్వీకరించండి. కోణార్క్ మీటర్స్ వంటి కంపెనీలు నీటి నిర్వహణకు సమగ్ర విధానాలను అందిస్తాయి, నీటి సంరక్షణ, సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే సాధనాలు మరియు సాంకేతికతలను అందిస్తాయి. అటువంటి పరిష్కారాలను ఏకీకృతం చేయడం ద్వారా, నీటి-సురక్షిత భవిష్యత్తు అందుబాటులో ఉంటుంది. పరివర్తన రాత్రికిరాత్రే జరగదు, కానీ స్మార్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ వైపు ప్రతి అడుగు మన లక్ష్యానికి దగ్గరగా ఉంటుంది. వాతావరణ మార్పు మరియు పట్టణీకరణ నేపథ్యంలో, ఇప్పుడు చర్య తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కలిసి పని చేయడం, వినూత్న పరిష్కారాలను స్వీకరించడం ద్వారా, భవిష్యత్ తరాలు నివాసయోగ్యమైన నగరాలను మాత్రమే కాకుండా నిజమైన స్థిరమైన నగరాలను వారసత్వంగా పొందేలా మేము నిర్ధారించగలం.

# ఏపీపై : రానున్న మూడ్రోజులు అతి భారీవర్షాలు

మొదటి పేజి తరువాయి



తుపాను ప్రభావంతో గురు,శుక్ర,శనివారాల్లో కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మూడు రోజులు మిగిలినచోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. భారీ వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.తీవ్రవాయుగుండం గడిచిన 6 గంటల్లో గంటకు 10 కి.మీ వేగంతో ఉత్తర-వాయువ్య దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తీవ్రవాయుగుండం ప్రస్తుతానికి ట్రింకోమలీకి తూర్పుగా 1100 కిమీ, నాగపట్నానికి ఆగ్నేయంగా 350 కి.మీ, పుదుచ్చేరికి 450 కి.మీ, చైన్నైకి 530 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాయువ్య దిశగా కదులుతున్న తీవ్రవాయుగుండం బుధవారం రాత్రికి తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. శనివారం మత్స్యకారులు సముద్రంల్లోకి వేటకు వెళ్లరాదని సూచించారు. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 55-65 కి.మీ గరిష్టంగా 75 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిచారు.భారీ వర్షాలు నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయం పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రైతులు పంట పొలాల్లో అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని కోరారు.

రానున్న నాలుగు రోజులు వాతావరణం ఇలా

నవంబర్ 28, గురువారం : నెల్లూరు, సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య,చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

నవంబర్ 29, శుక్రవారం

ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

నవంబర్ 30, శనివారం :- నెల్లూరు, అనంతపురం, సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికాపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

డిసెంబర్ 1, ఆదివారం :- శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, కోనసీమ, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అల్లూరి, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## డివైజిఏం గా పదోన్నతి పొందిన ఆంజనేయ ప్రసాద్ కి సన్మానం చేసిన ప్రభావిత ప్రాంత యువకులు...



రామగుండం **/నవంబర్ 28(జనం రిపోర్టర్):** గోదావరిఖని లోని ఆర్టీవన్ ఎన్విరాన్మెంట్ అధికారిగా పని చేస్తున్న ఆంజనేయ ప్రసాద్ అధికారుల పదోన్నతి ఇంటర్వ్యూ ద్వారా డివైజియం గా పదోన్నతి లభించిడం అభినందనీయమన్నారు.మద్దెల దినేష్ మాట్లాడుతూ.. ఎన్విరాన్మెంట్ తో పాటు, ప్రభావిత ప్రాంతాల ప్రజలకు కార్మికుల కుటుంబాలకు సంక్షేమం చూసుకువడంలో ఆంజనేయ ప్రసాద్ తన పై అధికారులతో ఒప్పించి సహాయం చేయడంలో ముందు ఉంటారని, ముఖ్యంగా స్థానిక నిరుద్యోగులకు వీటిసి వందలాది మందికి చేయించారని, ప్రభావిత ప్రాంతాలకు ప్రజలకు కావలసిన సౌకర్యాలు అధికార్లను మెప్పించి, ఒప్పించడంలో ముందు ఉండే అధికారి ఆంజనేయ ప్రసాద్ అని, నీతికి నిజాయితీకి మారు పెరు అని ఇలాంటి అధికారికి మరిన్ని ఉన్నత పదవులు ఆవరోహించాలని పేర్కొన్నారు.మద్దెల దినేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా ఆంజనేయ ప్రసాద్ ని కలిసి ఘనంగా సత్కరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో ప్రభావిత ప్రాంతాల యువకులు మేదరి. శ్రీనివాస్, రేణిగుంట్ల నరేంద్ర, గంగారపు ప్రసాద్, ఆకాష్, నవీన్, రాజు, శ్రీధర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలేవర్ధంతి



బాపట్ల **/నవంబర్ 28(జనం రిపోర్టర్):** ప్రజా ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి కార్యక్రమం గురువారం బాపట్లలో జరిగింది. స్థానిక పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు విద్య అవసరమని గుర్తించిన మేధావిగా అభివర్ణించారు. ప్రజలలో చైతన్యం తెచ్చిన మహనీయులని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి రాజేష్ దాసు, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సాగుతున్నది ప్రజా పాలన కాదని.. సీఎం రేవంత్‌రెడ్డి ఫస్ట్రేషన్ పాలన అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి విమర్శించారు.




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 28: రేవంత్ రెడ్డి '23వ పులకేశీ'లో వడివేలులా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రైతులకు బోనస్ అనేది ఒక బోగస్ పథకమని వ్యాఖ్యానించారు. అన్నదాతలు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. లగచర్ల నుంచి దిలావర్‌పూర్ వరకు రైతులకు అన్యాయమే జరుగుతోందని పేర్కొన్నారు. గురుకులాల్లో విషాహారం తిని మృత్యువాత పడుతున్నారన్నారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ జిల్లాలోని కల్లు బట్టీల్లో కమీషన్లు ప్రారంభించారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వత్తాసు పలుకున్న అధికారుల పేర్లను పింక్ బుక్కులో ఎక్కిస్తున్నామని.. అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని వ్యాఖ్యానించారు.

ఐదువేల మందితో దీక్షా దివస్

జిల్లాలో ఐదువేల మందితో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. దీక్షా దివస్‌కు నాయకులు, కార్యకర్తలు, తెలంగాణవాదులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాంకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు

## సత్యనారాయణ స్వామి వారి వ్రతం



బాపట్ల **/నవంబర్ 28(జనం రిపోర్టర్):** బాపట్ల పట్టణం టౌన్ హాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వారి వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు కు స్వామివారి ఆశీర్వచనం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి నా బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ కుటుంబ సమేతంగా స్వామివారి పూజా కైంకర్యాలలో పాల్గొన్నారు.. సత్యనారాయణ స్వామి వారి దర్శన భాగ్యం నా పూర్వజన్మ సుకృతం అని అన్నారు అనంతరం వేద పండితులు స్వామివారి ఆశీర్వచనం తీర్థప్రసాదాలను అందజేశారు... ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్, గోపాలం లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు...

## నిజామాబాద్ నగర ట్రాఫిక్ సీఐగా పబ్బ ప్రసాద్.



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనం రిపోర్టర్ నవంబర్ 28: గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వీరయ్యను పీసీఆర్‌కు పంపించిన విషయం తెలిసిందే. కాగా.. ఆదిలాబాద్ డీసీఆర్‌బీ లో పనిచేసిన ప్రసాద్ ట్రాఫిక్ సీఐగా వచ్చారు.ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# సామాజిక విప్లవోద్యమ పితామహుడ మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి



రేపల్లె నవంబర్ 28 జనం రిపోర్టర్ : ఆధునిక భరతీయ సమాజాన్ని సంస్కరించడానికి ఎందరో సంస్కర్తలు న్న నిర్మూలన కోసం, సమాజ పునర్నిర్మాణం కోసం మొట్టమొదట దారులు వేసిన ఆధునిక యుగ పురుషుడు మహాత్మా జ్యోతి రావు పూలే. సమాజంలోని అట్టడుగు జనావళి అభ్యున్నతే ఏకైక ధ్యేయంగా పనిచేసి నిరాడంబర జీవితాన్ని గడిపారు పూలే , అహంకారం, ఆధిపత్యం, అజ్ఞానం, అంధకారం అంటే గిట్టని జ్యోతి రావు పూలే అందరి ఆనందాన్ని కోరుకున్న ఆశావాది. మన అంద ఆశాజ్యోతి. సామాజిక విప్లవోద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతి రావు పూలే. శతాబ్దాలుగా అణిచి పెట్టబడిఉన్న కింది కులాల గురించి ఆలోచించిన మొదటి నాయకుడు జ్యోతిరావు పూలే. సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం అంటూ ఆలోచించి ప్రబోధించి దళిత వర్గాలను, బలహీన వర్గాలను జాగృతం చేసిన క్రియాశీలి ఆయన. మానవ హక్కుల కోసం పోరాటం నడిపిన విప్లవకారుడు జ్యోతిరావు పూలే. భారతీయులంతా ఒకటే వారంతా సమానమే అనే భావనకు ఆద్యుడు ఆయన. విద్య అనేది మానవుడికి జ్ఞానద్వారాన్ని తెరుస్తుందని గ్రహించి నిమ్నవర్గాలకు సమాజంలో అట్టడుగున పడి ఉన్న వర్గాలకు జ్ఞానజ్యోతి చూపాడు. శతాబ్దాలుగా తమకంటూ ఒక ప్రతిష్టాత్మకమైన పరిధిని ఏర్పాటు చేసుకొని సమాజంపై పెత్తనం చెలాయిస్తున్న ఆధిపత్య వర్గాలతో ఆయన ఒంటరిగా నిజాయితీగా పోరాడాడు. విద్యకు విజ్ఞానానికి గుత్త అధికారులుగా ఉన్న వర్గం ఆయనకు అడ్డుగా నిలిచింది. నిమ్న వర్గాల హక్కులను, నాటి పెత్తందారి వర్గాల నుంచి తీసుకోవడానికి ఆయన ఎంతగానో పోరాడవలసి వచ్చింది. జ్యోతిరావు పూలే సామాజిక విప్లవోద్యమ పిత. సమాజంలో నిమ్న జాతులు, స్త్రీలు, కార్మికులు, కర్షకులు ఎలా దోపిడీకి గురవుతున్నారో ఎలా అణిచివేయబడుతున్నారో చూసి వారిని ప్రబోధించి వారికి ప్రతిఘటన మార్గం చూపాడు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి పై జ్యోతిరావు పూలే సిద్ధాంతాల ప్రభావం చాలానే ఉంది. జ్యోతిరావు ను(1827-1890) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్(1891-1956) చూడనే లేదు. కారణం వారు సమకాలికులు కాకపోవడమే. క్రింది కులాల వారు విద్యావంతులు కావాలి అన్న ప్రబోధాన్ని ఆచరణలో పెట్టినందువల్లనే బీఆర్.అంబేద్కర్ తండ్రి రాంజీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వంటి ప్రతిభావంతుని మన దేశానికి అందించగలిగారు. అందుచేతనే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్యోతిరావ్ అంటే ఎనలేని గౌరవం. అందుచేతనే ఆయన రచించిన "శూద్రులు ఎవరు?" అనే గ్రంథం జ్యోతిరావుకు అంకితం చేశాడు. మహాత్మ జ్యోతిరావు పూలే గురించి ఎంత చెప్పినా తక్కువే. జ్యోతిరావు %ఎ%1848 లోనే అంటరానితనం వద్దని చెప్పాడు. నిమ్న జాతుల వారిని బావి నుంచి నీరు తోడుకోనిచ్చారు. సమాజం వెలివేసిన వారి పిల్లలకు చదువు నేర్పారు. అనాధ శిశువులను ఆదరించాడు. స్త్రీలకు విద్య నేర్పాడు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించాడు. బాల్యవివాహాలు, వితంతువులకు జుట్టు తీయించడం వంటి మూఢాచారాలను ఖండించాడు. పురోహితవ్యవస్థను వర్ణవ్యవస్థను ప్రతిఘటించాడు. పురోహితులు లేకుండానే మత సంబంధమైన విధులు ఎవరికివారు నిర్వర్తించు కోవచ్చని చెప్పారు. భారతీయులు మొట్టమొదటిగా మహాత్మా బిరుదునిచ్చి సత్కరించింది ఈయననే. భారతదేశంలోని కుల వ్యవస్థను సామాజిక అణచివేతను దోపిడీని వ్యతిరేకిస్తూ సేద్యగాని చర్నాకోల, గులాంగిరి వంటి రచనలు చేయడంతో పాటు సత్యశోధక సమాజ్ ద్వారా ఆచరణను కూడా ప్రారంభించారు మహాత్మ జ్యోతిరావు పూలే. మహాత్మ జ్యోతిరావు పూలే1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. అప్పటి ఆచారం ప్రకారం పూలేకు 13 ఏళ్ల వయసులోనే 8 ఏళ్ల వయస్సు గల సావిత్రితో పెళ్లయింది. పూలే 1841లో పుణేలోని స్కాటిష్ మిషన్ స్కూల్లో చేరి సెకండరీ విద్యను పూర్తి చేశారు. 1848లో జరిగిన తన బ్రాహ్మణ మిత్రుని వివాహంలో పూలే బీసీ 'మాలీ' కులానికి చెందిన వాడవడం వల్ల కులవివక్షకు గురయ్యాడు. మిత్రుని పెళ్లి ఊరేగింపులో జరిగిన ఈ అవమానం పూలే జీవితంలో గొప్ప మార్పుకు కారణం అయినది. అప్పటి నుంచి కులవివక్షపై పోరాడాలని నిర్ణయించుకున్నాడు. కులవిధానంలో నాటి పెత్తందారీ వర్గాలను విమర్శించడమే కాకుండా సమాజంలో వారి ఆధిపత్యాన్ని వ్యతిరేకించాడు. జ్ఞానసంపదకు అందరికీ అవకాశం ఇవ్వకపోవడానికి ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. థామస్ పెయిన్ 1791 లో రాసిన "రైట్స్ ఆఫ్ మెన్" అనే గ్రంథం పూలే చదవడం ద్వారా మానవ హక్కుల గురించి తెలుసుకున్నాడు. భారతదేశంలోని బడుగు బలహీన అట్టడుగు వర్గాల వారు మన కుల వ్యవస్థలో అమెరికాలోని నల్లజాతి బానిసలాగే ఉన్నారని భావించాడు. కుల, మత, వర్గ, వర్ణంతో సంబంధం లేకుండా మానవులందరూ దేవుని దృష్టిలో సమానమేనని, అందరికీ సమాన హక్కులు ఉండాలని అన్నారు. పూలే కులవ్యవస్థ లోని అమానుషత్వాన్ని అంటరానితనాన్ని నిరసించాడు. సమాజంలో ఆధిపత్య వర్గాల ఆధిపత్యానికి మూల కారణం ఏమిటి అని ఆలోచించి దేశం ప్రగతిపథంలో నడవాలంటే అందరికీ విద్య అవసరమని భావించారు. త్వరితగతిన సమాజంలో మార్పు రావాలంటే విద్య ద్వారా సాధ్యమని తలచి తన భార్య సావిత్రిబాయి పూలేను చదివించి బాలికల పాఠశాలను మొదటిగా ఏర్పాటుచేయడం ద్వారా అందరికీ విద్య అందించాడు. సావిత్రిబాయి పూలే భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయిని కావడం గమనించదగ్గ విషయం. రైతాంగ ఉద్యమాలను నడిపారు. మిల్లు కార్మికుల కోసం పోరాడారు. చాందస వాద ఆధిపత్య వ్యతిరేక ఉద్యమాలను నడిపించారు. శూద్ర వర్గంలోని రైతాంగంపై పెట్టుబడిదారుల శ్రమదోపిడిల ను ఎదిరించాడు . సమాజం సమూలంగా మారాలని భావించిన పూలే దంపతులు బ్రాహ్మణ వితంతు మహిళలకు పుట్టిన అనాధ శిశువుల కోసం శరణాలయాన్ని ప్రారంభించారు. మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సాంఘిక విప్లవకారుడు, నాటి సమాజంలో శతాబ్దాలుగా నిస్సహాయులుగా పడి ఉన్న వారి కోసం జీవితాంతం శ్రమించిన త్యాగశీలి. చాందస వాద ఆదిపత్యాన్ని ప్రతిఘటించిన సాహసి. ధర్మశాస్త్రాల ప్రామాణికతను వేద పురాణాల వాస్తవికతను ప్రశ్నించిన హేతువాది. అతి సామాన్య కుటుంబంలో పుట్టి ఉన్నత పాఠశాల విద్య మాత్రమే పూర్తి చేసిన జ్యోతిరావు అత్యున్నత విద్యనభ్యసించిన మేధావులకు కూడా అందని తార్కిక పటిమను, పరిశోధనా పాటవాన్ని స్వయంకృషితో సాధించాడు. సమాజంలోని హెచ్చుతగ్గులను సమం చేసి కాలుష్యాన్ని కడిగేసే పనిలో నిరంతర కార్యశీలి గా ఉద్యమించారు. సమాజ దౌష్ట్యానికి ఎదురొడ్డి నిలిచారు. కవి, పద కర్త, గ్రంధకర్త త్యాగశీలి అయిన పూలే పక్షవాతం జబ్బునపడి 1890 నవంబర్ 28న అమరులయ్యారు.

# నిజామాబాద్ జిల్లాలో యథేచ్ఛగా మొరం, మట్టి తవ్వకాలు

గుట్టలను కొల్లగొడుతూ మొరం వ్యాపారస్తులు రాజ్యాంగ వ్యవహరిస్తున్న వైనం..

గుట్టలు, ప్రభుత్వ స్థలాలే టార్గెట్...

పట్టించుకోని అధికార యంత్రాంగం...

రాత్రిపూట 11గంటల నుండి ఉదయం 5 గంటల వరకు యదేచ్ఛగా సాగుతున్న మొరం దందా...

పలువురు ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు....

అనుమతులు ఇస్తే రాత్రి వేళలో ఎందుకు మొరం ఏ బిల్లులు లేకుండా తరలిస్తున్నారు?..



**జనం రిపోర్టర్ ప్రత్యేక కథనం**

నిజామాబాద్, జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 28: నిజామాబాద్ జిల్లాలో మొరం తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్నాయి. గుట్టలు, ప్రభుత్వ భూములనే తేడా లేకుండా.. అనుమతులు తీసుకున్న వారు మినహాయిస్తే అక్రమార్కులు ఇష్టం వచ్చిన రీతిలో తవ్వకాలు చేస్తున్నారు. వెంచర్‌లు, భవన నిర్మాణాలకు సరఫరా చేస్తూ వారు నిర్ణయించిందే ధరగా అమ్ముతున్నారు. నగరంతో పాటు ఇతర మున్సిపాలిటీల్లో సిండికేట్‌గా మారి అమ్మకాలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలు ఉండడంతో యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఆరోపణలు ఏ దైనా గ్రామం నుంచి ఫిర్యాదు వస్తే తప్పా ఆ వైపు దృష్టి పెట్టడం లేదు. అక్రమ తవ్వకాలను ఆపడం లేదు. జిల్లాలో ప్రభుత్వ అవసరాలతో పాటు భవన నిర్మాణానికి మొరం, మట్టి తవ్వకాల కోసం ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చింది. ఆ ప్రాంతాల్లో మాత్రమే తవ్వకాలు చేయాలని కోరింది. కానీ నిజామాబాద్ రూరల్ పరిధిలో మల్లారం వారి సిర్పూర్, రాంపూర్, యానంపల్లితో పాటు కొన్ని గ్రామాల్లో ప్రైవేటు అవసరాల కోసం గనులు, భూగర్భశాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. ప్రభుత్వ అభివృ ద్ధి పనుల కోసం మరికొన్ని గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మట్టి, మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చారు. ఇవి మినహాయిస్తే వేరే ఏ ప్రాంతాల్లో అనుమతులు ఇవ్వలేదు. దీ నిని ఆసరాగా చేసుకొని కొందరు ఇతర ప్రాంతాల్లో కూడా తవ్వకాలు చేస్తూ ఎక్కువ ధరలకు మొరం ని అమ్ముతున్నారు. ఎక్కువ గా గుట్టలను ఆక్రమిస్తూ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ప్ర భుత్వ నిబంధనల ప్రకారం గుట్టలలో మట్టి తవ్వకాలకు అ నుమతులు లేవు. పర్యావరణ అనుమతులు ఇవ్వడం లేదు. జిల్లాలోని పలు గుట్టల్లో ఈ అక్రమ తవ్వకాలు చేస్తున్నారు. ఎడపల్లిలోని జైతాపూర్, అక్బర్‌నగర్, ఊట్‌పల్లి గుట్ట, నాగారం గుట్టలలో ఈ తవ్వకాలు చేస్తున్నారు. నిజామాబాద్ రూరల్, మోపాల్, మాక్లూర్, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలోని గుట్టల్లో కూడా తవ్వకాలు జరిపి మట్టి, మొరం సరఫరా చేస్తున్నారు. నందిపేటలోని పలుగుట్ట, ఆర్మూర్ మండ లం ఫత్తేపూర్, యానంగుట్ట, అంకాపూర్ గుట్ట ప్రాంతాల్లో ఎక్కువగా తవ్వకాలు చేస్తున్నారు. అనుమతులు లేని చోట తవ్వకాలు జరుపుతున్నారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో తవ్వకాలు చేస్తున్నారు. అధికారులు అడిగితే భూమిని చదు ను చేస్తున్నామని చెప్పి మట్టి, మొరాన్ని తరలిస్తున్నారు.

### నగరంలో ఇద్దరి కనుసన్నల్లోనే దందా

నిజామాబాద్ నగరంలో మొరం అమ్మకాలన్నీ ఇద్దరి క ను సైగలు కొనసాగుతున్నాయి. నగరం చుట్టుపక్కల గుట్టలు, ఇతర భూముల నుంచి తవ్వకాలు చేస్తూ అమ్ముతున్నారు. ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో యథేచ్ఛగా కొ నసాగిస్తున్నారు. ఈ మొరంనకు వీరు నిర్ణయించిందే రేటు గా అమ్మకాలు చేస్తున్నారు. టిప్పర్‌కు రూ.2,500 నుంచి రూ.3,500 మధ్య అమ్ముతున్నారు. గుట్టల నుంచి తవ్వుతూ అమ్మకాలు చేస్తున్నారు. నగరంలోని భవన నిర్మాణంతో పా టు వెంచర్‌లకు సరఫరా చేస్తున్నారు. వీరు నిర్ణయించిందే రేటు కావడంతో అనుమతులు పొందిన వారు కూడా వీరు చెప్పిన విధంగానే మొరం సరఫరా చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండడం వల్ల తమ ముందు నుంచే వాహనాలు వెళ్లినా అధికారులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి సమాచారం వస్తే తప్పా వాటిని సీజ్ చేయడం లేదు. ఆర్మూర్‌లోనూ ఇదే పరిస్థితి ఉంది. అధికారుల అండదండలు ఉన్నాయని చెబుతూ మొరం తవ్వకాలను చేస్తున్నారు. బాహటంగా పగటి పూటనే కాకుండా అర్ధరాత్రి వేళలో గుట్టలు తవ్వి సరఫరా చేస్తున్న రెవెన్యూ, అటవీ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. పని ఆరోప్నాలు వినిపిస్తున్నాయి బోధన్ పరిధిలోనూ కూడా ఇదే పరిస్థితి ఉంది. అధికారుల అండ దండలతో ఈ మొరం సరఫరా చేస్తున్నారు. ఎడపల్లి, రుద్రూరు మండలాల నుంచి ఎక్కువ గా బోధన్‌కు సరఫరా చేస్తున్నారు. జిల్లా పరిధిలో మొరం తవ్వకాలన్నీ అధికార పార్టీ అనుచరులవే కావడంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఎవరై నా పట్టుకున్నా ప్రజాప్రతినిధుల నుంచి ఫోన్‌లు వస్తుండడంతో పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

### ఫారెస్టు భూముల్లోనూ తవ్వకాలు.

జిల్లాలోని రిజర్డ్ ఫారెస్ట్ పరిధిలో మట్టి, మొరం తవ్వకా లు జరుగుతున్నా అటవీ శాఖాదికారులు పట్టించుకోవడం లేదు. పోడు పేరుతో వ్యవసాయం చేసే వారిని భూముల నుంచి పంపిస్తున్న అధికారులు గుట్టలను తవ్వుతుంటే మా త్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మట్టి, మొరం తవ్వకా లు చేసే వారు ఎక్కువ మంది ప్రజాప్రతినిధుల అనుచరు లు కావడం లేదా వారి బంధువులు పదవుల్లో ఉండడం వల్ల కిందిస్థాయి అధికారులు కూడా పట్టుకునేందుకు జంకుతున్నారు. జిల్లాస్థాయి అధికారులు దృష్టి పెడితే అక్రమ తవ్వకాలు ఆగే అవకాశం ఉంది. లేకుంటే కొన్ని సంవత్సరాలోనే గుట్టలు మాయమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రొక్లైన్‌ల ద్వారా తవ్వుతుండడం వల్ల చిన్న గుట్టలు కూడా మాయమయ్యే పరిస్థితి ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న మొరం, మట్టి అక్రమ తవ్వకాలపై నిఘా విభాగం కూడా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులకు వివరించడంతో పాటు ఎవరెవరూ ఈ మొరం త వ్వకాల్లో ఉన్నారో వివరాలు పంపించినట్లు తెలుస్తోంది. జి ల్లాలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మట్టి తవ్వకాలకు అనుమతులు ఇచ్చామని జిల్లా గనులు, భూగర్భశాఖాధికారిలు. తెలిపారు. ప్రభుత్వ అవసరాలకు అక్కడక్క డ రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారన్నారు. అక్ర మ తవ్వకాలు ఎక్కడ ఉన్నా పట్టుకొని సీజ్ చేస్తున్నామని తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శం

### ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలి

### ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల **/నవంబర్ 28(జనం రిపోర్టర్):** మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతి సందర్భంగా బాపట్ల చీల్ రోడ్డు సెంటర్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ... పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విదాలుగా ప్రజలను చైతన్యం పరిచారని, ప్రజలలో అనాదికాలంగా పాతుకుపోయిన వివక్షలను నిర్మూలించుటకొరకు తన జీవితాన్నే త్యాగం చేశారని, ముఖ్యంగా వితంతు పునర్వివాహం గురించి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చారన్నారు. అణచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మ స్థైర్యం కల్పించి వారి సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడని, ప్రపంచానికే జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శం అని అన్నారు. పూలే విద్య వివక్ష, పేదరికం, ఆర్థిక అసమానత్వం నిర్మూలించడానికి, కుల, మత రహిత సమాజ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, బాపట్ల పట్టణ సీఐ భాష,తాతా జయప్రకాష్ నారాయణ, పల్లం సరోజినీ, పమిడి భాస్కరరావు, చేజర్ల సతీష్, ఆవల వెంకటేశ్వర్లు,కూటమి నాయకులు, పట్టణ సీఐ అహ్మద్ జానీ,తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## డ్రెయినేజీలో పడి చిన్నారి మృతి..



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 28: ఆర్మూర్: ఆడుకుంటూ వెళ్లి డ్రెయినేజీలో పడి చిన్నారి మృతిచెందిన ఘటన ఆర్మూర్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాంనగర్‌లో ఉదయం మట్ట ధనస్వి(4) చిన్నారి ఆడుకుంటూ ఇంటి ఎదుటే ఉన్న డ్రెయినేజీలో పడిపోయింది. చిన్నారి తల్లిదండ్రులు రెండు గంటలపాటు కాలనీ అంతా వెతికినా దొరకలేదు. చివరికి డ్రెయినేజీలో చిన్నారి మృతదేహాన్ని చూసి లబోదిబోమన్నారు.

## సీఎంఆర్ఎఫ్ తో కుటుంబానికి ఆర్థిక భరోసా



కరీంనగర్,జనం రిపోర్టర్,నవంబర్ 28: గట్టుభూత్కూరు గ్రామానికి చెందిన బొల్లపత్తిని లక్ష్మికి రూ. 1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు.ప్రమాదాల వల్ల,అనారోగ్యంతో,బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందినవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు.గంగాధర మండలం గట్టుభూత్కూరు గ్రామానికి చెందిన బొల్లబత్తిని లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.50 లక్షల పరిహారం మంజూరు అయింది. గురువారం కరీంనగర్ లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భాదిత కుటుంబానికి చెక్కును అందజేశారు. సీఎంఆర్ఎఫ్ తో తమను ఆదుకున్న ఎమ్మెల్యే సత్యం కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రోమాల రమేష్, దుబ్బాసి బుచ్చయ్య, బైరిశెట్టి సంపత్, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి
## - ఘన నివాళులర్పించిన గంగయ్య సిపిఎం పార్టీ



**బాపట్ల /నవంబర్ 28(జనం రిపోర్టర్):** బాపట్ల జిల్లాలోని బాపట్ల కొత్త బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్నటువంటి మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సిపిఎం పార్టీ బాపట్ల జిల్లా కార్యదర్శి. సిహెచ్ .గంగయ్య పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... 19వ దశాబ్దపు సంఘసంస్కర్తల్లో జ్యోతిరావు పూలే ఒకరు అని అన్నారు. రైతులు,కార్మికులు సమస్యలపై పోరాడిన ఏకైక 19వ దశాబ్దపు సంఘసంస్కర్త పూలే మాత్రమే అని అన్నారు. చిన్నతనంలో జ్యోతిరావు పూలే కూడా పొలంలో వాళ్ల తండ్రిగారి వ్యాపారం అంగడిలో తండ్రికి సహాయంగా ఉండేవాడని, రైతుల సమస్యలు పట్ల అవగాహన ఉండేదని అలనాటి శూద్రులు అతిశూద్రులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు,కార్మిక సమస్యలపై కూడా పోరాడేవారు అని అన్నారు. ముంబైలోని ఖండే అనే నాయకుడితో కలిసి కార్మిక సంఘం నెలకొల్పారు. సామాజిక ఆర్థిక పోరాటాలు రెండిటిని ఆయన నిర్వహించారు.అలనాటి రైతు సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారు.రైతులు పడుతున్న ఇబ్బందుల్ని సమస్యలను దృష్టిలో ఉంచుకొని పూలే ఒక పుస్తకాన్ని దాదాపు 150 సంవత్సరాల క్రితం రచించారు. అందులో రైతు శ్రమ ఫలితాలను మతాచారాలు ద్వారా పురోహితులు, భూ వివాదాలలో రైతులును మోసగించిన కులకర్ణిలు, బ్రాహ్మణులు ఉద్యోగులు అలాగే ప్రభుత్వం వారిని ఎలా దోసుకుంటున్నదో వివరంగా చెప్పారు.అదేవిధంగా సనాతన ధర్మం ఎంత గొప్పదని ఎవరు ఎంత జబ్బలు చరిచిన అది శూద్రులను అతిశూద్రులను ఎలాంటి హక్కులు లేని దాసునిగా మార్చింది అనేది దాచి పెట్టలేని నిజం అని అన్నారు.ప్రజలందరికీ సామాజిక ఆర్థిక హక్కులు ప్రజలకు కలిగించడమే మహాత్మ జ్యోతిరావు పూలే కి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నూతలపాటి. కోటేశ్వరరావు,కె.నాగేశ్వర రావు, సిపిఎం పార్టీ బాపట్ల జిల్లా నాయకులు పి.కొండయ్య,ఎన్. బాబురావు, తురిమెళ్ళ.కృష్ణమోహన్,సిపిఎం పార్టీ టౌన్ నాయకుడు కె.శరత్ పాల్గొన్నారు.

## సిఎమ్ఆర్ఎఫ్ చెక్కుల పంపిణి




చొప్పదండి, జనం రిపోర్టర్, నవంబర్ 28: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండలంలోని భూపాలపట్నం, వెదురుగట్ట గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 33 మందికి దాదాపు 10 లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లో అందచేశారు.ఈ సందర్భంగా వారు కష్టకాలంలో ఉన్నప్పుడు తోడుగా వారికి డబ్బులు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, కౌన్సిలర్ కొట్టె అశోక్, నాయకులు ముద్దం తిరుపతి, మునిగాల సుధాకర్ గౌడ్, మునిగాల చందు, గుర్రం రమేష్ గౌడ్, మావురపు రాములు, చిలుక సంజీవ్, మారం శ్రీనివాస్ యాదవ్,తోడేటి డేవిడ్, కొత్తూరు శంకరయ్య,కనుమల్ల రాజశేకర్,అడ్డగుంట శంకరయ్య, విద్యాసాగర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామం జయగిరిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



హసన్ పర్తి మండలం నవంబర్ 28 జనం రిపోర్టర్: హసన్ పర్తి మండల పరిధిలోని గ్రామం జయగిరిలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షులు పో రెడ్డి మహేందర్ రెడ్డి మరియు గ్రామ పార్టీ అధ్యక్షులు రామంచ ప్రభాకర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జయగిరి గ్రామంలోని లబ్ధిదారులకు అందజేయడం జరిగింది లబ్ధిదారుల వివరాలు కొంగంటి రాజు సన్నాఫ్ పర్వతాలు కు 18000, వేల రూపాయలు, మరియుఆలేటి గట్టు స్వామిసన్నాఫ్ ఐలయ్య కు14000,రూపాయలు, మరియు రేణు కుంట్ల జయ వైఫ్ ఆఫ్ రమేష్ కు21500, తాళ్ల పెల్లి రాజ్ కుమార్ సన్నాఫ్ లచ్చయ్య కు46000, రూపాయలు గడ్డం భగత్ సన్నాఫ్ సంపత్ కు38000 రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగింది దీనికి లబ్ధిదారులందరూ చెక్కులను ఇంటికి వచ్చి ఇచ్చినందుకు ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు కు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లబ్ధిదారులందరూ ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ డైరెక్టర్ పల్లె దయాకర్, మాజీ ఎంపిటిసి రేణు కుంట్లపరమేశ్వరి అశోక్, గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షులు ఆలేటి కుమారస్వామి, గ్రామ ప్రధాన కార్యదర్శి జనగాని సంతోష్ గౌడ్, గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షులు రేణు కుంట్ల ప్రవీణ్,కాంగ్రెస్ నాయకులు కొత్తకొండ రవి,బొజ్జ రాజ్ కుమార్,బొజ్జ కుమారస్వామి,కొత్తకొండ వెంకటేష్, పల్లె కుమారస్వామి, జనగాని రమేష్,ఆర్ పౌలు, వల్లాల అశోక్, దండబోయిన రవి, పోగుల రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు,మహిళలు, తదితరులు పాల్గొన్నారు

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి




హసన్ పర్తి మండలం నవంబర్ 28 జనం రిపోర్టర్: టీఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా హసన్ పర్తి కేజిబివి లో భోజన విరామ సమయంలో కేజి బివి బోధన, బోధనేతర సిబ్బందికి కనీస వేతనం ఎంటీఎస్ చెల్లించాలని కోరుతూ నిరసన ప్రదర్శన చేశారు ఈ కార్యక్రమంలో టి ఎస్ యుటిఎఫ్ హసన్ పర్తి మండల కార్యదర్శి బి.సుధారాణి, ప్రత్యేక అధికారిణి అనిత తదితరులు పాల్గొన్నారు.

## అలుగు వాగు ప్రాజెక్టు ముంపు భూములకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డిమాండ్



ఎటపాక నవంబర్ 28జనం రిపోర్టర్: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం అచ్యుతాపురం గ్రామం దగ్గర 2000 సంవత్సరంలో నిర్మించిన అలుగు వాగు ప్రాజెక్టు లో కోల్పోయిన పట్టాదారులకు పట్టా లేకుండా సాగుచేసిన భూమి యజమానులకు కూడా నేటికీ పరిహారం ఇవ్వలేదు ఇది అన్యాయం బాధితులందరూ ఆదివాసి పేద రైతులే నష్టపరిహారం ఇస్తాము చూస్తాము అంటూనే రెండు రాష్ట్రాల యువజనతో సమస్యను ప్రభుత్వము మరియు సంబంధిత అధికారులు పక్కన పెట్టారు ఈ విషయం అమాయకులైన ఆదివాసీలు ఉన్నారు నిరాశ చెంది ఉన్నారు అయితే 2024 సంవత్సరంలో బాధితుల్లో కొందరు చింతూరు ఐ టి డి ఏ పి ఓ కి మరియు జిల్లా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ కి వినతిపత్రం ద్వారా విషయాన్ని గుర్తు చేయడం జరిగింది అయినా ఇంకా సమస్య పరిష్కరించలేదని గ్రామాన్ని చెరువుని సందర్శించిన సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులతో ఆదివాసీలు ఆవేదనతో చెప్పారు ప్రాజెక్టు పరిశీలించిన వారిలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు కే రంగారెడ్డి జిల్లా నాయకురాలు కే కల్పన డివిజన్ నాయకులు సాయి అన్న భూములు కోల్పోయిన ఆదివాసి రైతులందరూ రైతులు ఎందరో తేల్చి పట్టా భూములకు మరియు పట్టా లేని భూములను కూడా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని బాగు చేయించి కాలవలను రిపేరు చేయించి సాగునీరు అందించాలని అచ్యుతాపురం గ్రామస్తులకు లిఫ్ట్ ద్వారా పంటలకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కారం ఇరమయ్య కారం సత్తిబాబు కారం బంగారమ్మ కారం రామయ్య కారం హరిబాబు కారం రమేష్ మడకం విజయబాబు నాగరాజు తదితరులు పాల్గొన్నారు



## గాంధీభవన్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ ఇంఛార్జి దీపక్ మున్షి.....

### రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్...



**రామగుండం /నవంబర్ 28(జనం రిపోర్టర్):** హైదరాబాద్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్ లో గురువారం పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సన్నహ సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ పాల్గొని ప్రసంగిస్తూ, ఉమ్మడి మెదకు-నిజామాబాద్,ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభద్రుల, ఉపాద్యాయ పదవీకాలం మార్చి- 2025 తో ముగియనున్నది. అదే మాసంలో భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన తేదీలో ఎన్నికలు నిర్వహించబడుతాయి ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని పట్టభద్రుల, ఉపాద్యాయ మండలి ఎమ్మెల్సీ ఓటరు మహాశయులను కోరినా రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో ఉంది , ఈ ప్రజా ప్రభుత్వానికి మరింత అండగా ఉండడానికి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి, ఉపాధ్యాయులకు ఏదైనా సమస్యలు త్వరితగతిన పరిష్కరించదానికి శాసన మండలికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు , ఉత్తమ్ కుమార్ రెడ్డి , సితక్క , తెలంగాణ ప్రదేశ్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితర రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 2 గోడపత్రికలను అవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

### సిపిఎం బాపట్ల జిల్లా సభలను జయప్రదం చేయండి



రేపల్లె నవంబర్ 28 జనం రిపోర్టర్: భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)సిపిఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు సందర్భంగా బాపట్లలో నవంబర్ 30జరిగే బహిరంగసభను జయప్రదంచేయాలని...సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ పిలుపులి నవంబర్ 30,డిసెంబర్ 1 తేదీల్లో జరుగుతున్నా నేపథ్యంలో 30వ తేదీ సాయంత్రం 3.00 గంటలకు బాపట్ల పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ప్రదర్శన,ఆనంతరం రథం బజార్లో బహిరంగసభ జరుగుతుంది.ఈ బహిరంగ సభకు ప్రధానవక్తలుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి,సిహెచ్. బాబురావు, సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత 2022 నుండి ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో అనేక ప్రజా సమస్యల మీద సిపిఎం నిర్వహించినా,ప్రజాఉద్యమాల సమీక్షించుకోవడానికి,భవిష్యత్తు పోరాటాలను రూపొందించుకోవడానికి,దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలవల్ల ప్రజల మీద వస్తున్న భారాలను ఎదుర్కోవటానికి ఈ మహాసభలో చర్చించడం,నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుంది.ఈ మహాసబలు సందర్భంగా జరిగే బహిరంగసభ, ప్రదర్శనకు రేపల్లె ప్రాంతంలో సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు జిల్లావ్యాప్తంగా,వామపక్ష అభిమానులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం రేపల్లె పట్టణ నాయకులు కే. ఆశీర్వాదం,సిహెచ్.ఆగస్టీన్ లు పాల్గొన్నారు...

## పూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ఎన్టీఆర్ జిల్లా, నందిగామ,బ భారత ప్రథమ సామాజికతత్వవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా కాకాని నగర్ కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సమ సమాజ స్థాపనకు, బడుగ, బలహీన వర్గాలకు విద్యను అందిస్తూ అన్నిట్లో సమాన హక్కుల కోసం పోరాడిన పూలే ఆశయ సాధనలో అందరం నడుద్దామన్నారు.

### వికలాంగులకు ఇచ్చిన హామీలను

## ఎప్పుడు అమలు చేస్తారు?




అమరచింత వనపర్తి నవంబర్ 28 జనం రిపోర్టర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల వికలాంగులకు ఇచ్చిన హామీలు ఎప్పుడూ అమలు చేస్తారని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరి నుండి వికలాంగులకు 6000 పెన్షన్ పంపిణీ చేస్తామని మాట తప్పిందని అన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని బుధవారం ఆయన వికలాంగులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని ఆయనే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య చారి గట్టన్న ప్రభుదాస్ పాల్గొన్నారు.

## మందు బాబులపై కొరడా..!

### పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ వారికీ మద్యం సేవించి పట్టుబడితే జైలుకే..




**రామగుండం/నవంబర్ 28(జనం రిపోర్టర్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు మందుబాబులపై పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకనిఘా పెట్టారు. తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కేసు నమోదు చేసి జరిమానాలతో సరిపెట్టకుండా కోర్టు ముందు హాజరు పరిచి, ఏకంగా జైలుకు తరలించడం జరుగుతుందని తెలిపారు. గత కొద్ది కాలంగా పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ వారి సిబ్బంది వాహన తనిఖీలలో మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులను కోర్టు ముందు హాజరుపరచగా, జడ్జి విచారించి మందుబాబులకు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని, కోర్టు క్లీనింగ్ పనులు చేయాలని, కొంతమందికి జరిమానాలు , కొంత మందికి జైలు శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గురువారం 14 మంది మద్యం సేవించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారిని పెద్దపెల్లి కోర్టులో హాజరుపరచగా, జడ్జి ఎన్.మంజుల విచారించి 11 మందికి రూ.11,400/- లు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ... ప్రమాదాల నివారణే లక్ష్యంగా మందుబాబులపై ప్రత్యేక దృష్టి సారించామని,రోడ్డు ప్రమాదలలో అత్యధికంగా జరిగేవి మద్యం సేవించి వాహనాలు నడపడం వలన అని

## దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ వెంకయ్య స్వామి గుడి నిర్వాహకుల సహకారంతో నిరుపేదలకు భోజనం పంపిణీ



నవంబర్ 28 పొదిలి జనం రిపోర్టర్ : దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫుడ్ కలెక్షన్ మొదలుపెట్టిన విషయం అందరికీ తెలిసిందే ఈ కలెక్షన్ లో భాగంగా ఈరోజు పొదిలికి చెందిన శ్రీ వెంకయ్య స్వామి గుడిలో ఒక మంచి కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో మిగిలిన భోజనాన్ని గుడి నిర్వాహకులు దివ్యాంగ్ రక్షక్ ఫౌండేషన్ వారికి అందజేయడం జరిగింది ఫౌండేషన్ వారు ఈ భోజనాన్ని భద్రపరిచి పొదిలి కాలేజీ రోడ్డులోని శ్రీపతి నగర్ లో వందమంది నిరుపేదలకు పంపిణీ చేయడం జరిగింది దీని సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ మీరు జరుపుకునే పుట్టినరోజు, పెళ్లి శుభకార్యాలయాలలో మిగిలిన భోజనాన్ని వృధాగా పడవేయకుండా పొదిలి పరిసర ప్రాంతాలలో ఉన్నవాళ్లు 8500009928 ఈ నెంబర్కు సంప్రదించి అందించగలరని మీ భోజనాన్ని మీ పేరు మీద మరో నలుగురికి అందజేస్తామని తెలియజేయడం జరిగింది కార్యక్రమంలో నరసింహారావు, ఆంజనేయులు, రాధా, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి



**ఏలూరు/నవంబర్ 28(జనం రిపోర్టర్):** ఏలూరు జిల్లా అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు శాంతినగర్ లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది, కూటమి నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎంపీ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రిబాయి పూలే ద్వారా భారత దేశంలో మహిళల విద్యకు మార్గదర్శకులుగా నిలిచారని ఎంపీ తెలిపారు. సాంఘిక సంస్కరణ ఉద్యమం ద్వారా మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వీర్ల ప్రతాప్, కాట్రు బాలకృష్ణ, మాగంటి హేమసుందర్, ఎంపీ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## టిట్కో గృహాలలో మౌలిక వసతులు కల్పించాలి



పొన్నూరు నవంబర్ 28 జనం రిపోర్టర్: పొన్నూరు పట్టణ పరిధిలోని పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు సిబ్బందితో కలిసి పర్యటించారు. మౌలిక వసతులు కల్పించాలని టిట్కో గృహాల ప్రజలు ఫిర్యాదుల మేరకు ఆయన పర్యటించినట్లు తెలిపారు. టీట్కో గృహాలలో త్రాగునీటి సరఫరా, డ్రైనేజీలు, వీధి దీపాలు ,రోడ్లు తదితర మౌలిక సదుపాయాల గురించి ఆరాతీశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన గురించి సంబంధిత సిబ్బందితో చర్చించి త్వరితగతిన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులను నియమించిన రాష్ట్ర ప్రభుత్వం




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 28: ఆస్పత్రుల్లో ఆహార నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది... ఫుడ్ పాయిజన్ కేసులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఇటీవల వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ కేసులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫుడ్‌పాయిజన్ కేసులకు సంబంధించి కారణాలు తేల్చేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఫుడ్ సేఫ్టీ కమిషనర్, అదనపు డైరెక్టర్, జిల్లా స్థాయి అధికారితో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురుకులాలు, హాస్టళ్లు, అంగన్ వాడీలు, ఆస్పత్రుల్లో ఆహార నాణ్యతను టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. ఫుడ్‌పాయిజన్ జరిగినప్పుడు కారణాలు తేల్చి, బాధ్యులను గుర్తించనుంది.

# 7 కిలోల గంజాయి పట్టివేత



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 28: నిజాంబాద్ జిల్లాలో ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీలు బయటపడ్డ గంజాయి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి తరలిస్తున్న మహమ్మద్ వహీద్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి కేజీ ఎండు గంజాయి, వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది చంద్రమౌళి, సందీప్, శ్రీనివాస్, సాగర్, నరేశ్, దేవిదాస్, సాయిబాబా, మోహన్, ధర్మేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## శబరిమలకు తరలిన అయ్యప్ప స్వామి మాలధారులు



నందలూరు, నవంబర్ 28, జనం రిపోర్టర్: మండలంలోని అయ్యప్ప స్వామి మాలధారులు గురువారం దాదాపు 40 మంది శబరిమలకు తరలి వెళ్లారు. నందలూరు రైల్వే కేంద్రంలోని శ్రీ వరసిద్ధి వినాయక ఆలయం నందు మాల ధరించి దీక్ష చేపట్టిన అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు మేడ వెంకట కుమార్, ఎల్లయ్య, మాకం వెంకట కుమార్, కసువు వెంకటరమణ, కాకిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాల సమస్యను పరిష్కరించిన కమిషనర్



పొన్నూరు నవంబర్ 28. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణంలోని 6 వ వార్డులో గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పర్యటించారు. 6వ వార్డులో రైల్వే స్టేషన్ కి వెళ్లి రహదారి (తుంగభద్ర డ్రేయిన్ వంతెన పక్కన)ఎన్నో నెలలుగా పట్టణ ప్రజలకు , ప్రయాణికులకు ఇబ్బందిగా రోడ్డును గురువారం కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో శాశ్వత రహదారి మరమ్మత్తులు చేయించారు. రైల్వే స్టేషన్ ప్రధాన రోడ్డు సమస్యను పరిష్కరించడం పట్ల ప్రయాణికులు, స్థానిక ప్రజలు కమిషనర్ రమేష్ బాబుకు ధన్యవాదాలు తెలియచేశారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ఆర్మూర్ టౌన్ సి ఐ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) నవంబర్ 28: ఆర్మూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ పట్టణ సీఐ సత్యనారాయణ గౌడ్ సూచించారు. ఆర్మూర్ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనదారుల హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ బరువు కాదు.. బాధ్యత అన్నారు. మహిళలకు ఎలాంటి సమస్య ఉన్న షీ టీంకు సమాచారం అందించాలన్నారు, కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నుస్రత్ జాహన్, కళాజాత బఅందం సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఫుడ్ పాయిజన్ ఘటనలపై

# రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

### చెవిలో పువ్వులతో నిరసన...




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్ )నవంబర్ 28: రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా స్థానిక నాందేవ్ వాడ లో చెవుల్లో పూల తో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ నిజామాబాద్ కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో, రెసిడెన్షియల్ గురుకులాలలో, కేజీబీవీ లలో ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలు చేసుకుంటున్న ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్య వల్లే విద్యార్థులకు నాసిరక భోజనలతో విరేచనాలయ్యి ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడిలో విద్యార్థినీ మరణం బాధాకరం అని అవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి జిల్లా అంతటా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చక్రి నగర ఉపాధ్యక్షులు ఆజాద్, నాయకులు సుశాంత్, అనిల్, సాయి కృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన నాణ్యత పట్ల అప్రమత్తంగా ఉండాలి.....

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం /**నవంబర్ 28(జనం రిపోర్టర్):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎట్టి పరిస్థితులలో చిన్న సంఘటన కూడా జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యత అంశం పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ పాఠశాలల హెడ్ మాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,మధ్యాహ్న భోజన విషయంలో రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న సంఘటనల పట్ల ప్రభుత్వం తీవ్రంగా స్పందించిందని , పిల్లలకు అందించే ఆహారం నాణ్యత అంశంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ ఉండదని స్పష్టం చేసిందని అన్నారు. మన జిల్లాలో పిల్లలకు అందించే ఆహారం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో చిన్న తప్పు కూడా జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒక చిన్న సంఘటన జరిగిన విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేసే స్థాయికి సంఘటనలు జరుగుతున్నాయని ఇది అందరూ దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు. పాఠశాలలో పిల్లలకు ఆహారం అందించే ముందు రైస్, పప్పు ,కూరగాయల నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని అన్నారు. పాఠశాలల్లో పిల్లలకు మధ్యాహ్న భోజన ఆహారం వండే దగ్గర పరిసరాలు ఎలా ఉన్నాయో గమనించి శుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో ఉన్న రైస్ నాణ్యతను ఒకసారి పరిశీలించాలని, బియ్యంలో ఎక్కడైనా పురుగులు పట్టినట్లు ఉంటే వెంటనే స్టాక్ చేంజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో పిల్లలతో పాటు హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు భోజనం చేసేలా చూడాలని అన్నారు. పాఠశాలలో వచ్చే త్రాగునీటి సరఫరా నాణ్యతను సైతం పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు. నల్గొండలో నీటి ట్యాంకు లో మరణించిన కోతి పడిందని అటువంటి సంఘటనలు ఎక్కడ మన దగ్గర రాకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేస్తూ మధ్యాహ్న భోజన నాణ్యత పెంచాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలు భోజనం చేసే ముందు తప్పనిసరిగా హ్యాండ్ వాష్ చేసుకునే విధంగా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో

## ఎస్.కె రిహాన గారి సహకారంతో యాజకులకు బట్టలు పంపిణీ



నవంబర్ /**నవంబర్ 28(జనం రిపోర్టర్):** వివరాల్లోకి వెళితే నవ్యాంధ్ర దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో ఫుట్ కలెక్షన్ తోపాటు మిగిలిన బట్టలను కూడా పంపిణీ చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే ఈ కార్యక్రమంలో భాగంగా పొదిలి పొదిలికి చెందిన ఎస్.కె రిహానా గారు పాత చీరలను అందజేయడం జరిగింది ఈ చీరలను నవ్యాంధ్ర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో పొదిలిలోని శివాలయంలో తిరుగుతున్న యాచకులకు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫౌండర్ నరసింహారావు మరియు సహాయకులు రాధ పాల్గొన్నారు.

## హలో మాల - చలో (సింహగర్జన) హైద్రాబాద్ తరలిరండి...



రామగుండం /**నవంబర్ 28(జనం రిపోర్టర్):** మాలల ఐక్యతను చాటేందుకు సింహగర్జనను జయప్రదం చేమాలని 8 ఇంక్లైన్ కాలని మాల సంఘం నాయకులు మేదరి నర్సింగరావు, ఓరం సురేష్, చెరిమెల శ్రీనివాస్,బైరం సదానందం , మేదరి రవితేజ) కంక ప్రవన్ కుమార్ కాటం భాస్కర్, దుబాకీ కార్తిక్, పలిగి హరి



కిరణ్, గోసిక అశోక్ తదితరులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కాలని లో జరిగిన మాల కుల బాంధవుల సమావేశంలో పలువురు మాట్లాడారు . డిసెంబర్ 1న. " హైదరాబాదులోని జింకనా గ్రౌండ్ లో జరగనున్న మాలల సింహగర్జన కు మాల కుల బందు కుటుంబ సమేతంగా హజర్రై,ప్రభుత్వాలకు సత్త చాటాలని నాయుకులు పిలుపునిచ్చారు. 1వ. తేదీ ఉదయం 8 గంటలకు కాలని నుండి బస్సు బయలుతెరుతుందని, హైదరాబాద్ లో 12 గంటలకు సింహ గర్జన కార్యక్రమం ఉంటుందని దీని విజయవంతానికి మాలలు అంత కృషి చేసి బారి సంఖ్యలో తరలి రావాలని నాయకులు కోరారు.

## మహాత్మా జ్యోతిబా పూలే గారికి ఘన నివాళులు



నార్పల/**నవంబర్ 28(జనం రిపోర్టర్):** అర్పించిన. బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం నాయకులు శిరిశాల అంజి శిరిశాల రాంబాబు మహాత్మా జ్యోతిబా పూలేగారి 134వ వర్ధంతి సందర్భంగా.. పూలే ,



బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడారు స్త్రీలకు సమాన హక్కుల, విద్య ఉండాలని పరితపించారు విద్యకు ఆయనిచ్చిన ప్రధాన్యత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అనంతపురంలో జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉన్న శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం అనంతపురం జిల్లా నాయకులు శిరిశాల రమేష్ మోతి దస్తగిరి సిరవాటి శంకరయ్య శిరిశాల పవన్ మోతి రాము మోతి లోకేష్ శిరిశాల మురళి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన..




పొన్నూరు నవంబర్ 28 జనం రిపోర్టర్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు పొన్నూరు పట్టణం పి. బి.ఎన్. కళాశాలలో విద్యార్థులకు కాలేజ్ స్వీప్ ఆక్టివిటీస్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పొన్నూరు తహసిల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ పాల్గొన్నారు. క్రమబద్ధమైన ఎన్నికల భాగస్వామ్యం , ఎన్నికల ప్రక్రియపై ఓటు నమోదు పై అవగాహన కల్పించారు. ఓటరు యొక్క ప్రాథమిక లక్ష్యం, ఎన్నికల్లో భాగస్వామ్యం పొందుట ప్రజాస్వామ్యంలో యువశక్తి యొక్క ఆవశ్యకత, ఓటు ఎలా నమోదు చేసుకోవాలి అనే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు..ఎలా నమోదు చేసుకోవాలి అనే ప్రక్రియ పై అవగాహన కల్పించి అందరి విద్యార్థులతో ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు.

## సునీల్ కుమార్ దేశం విడిచి వెళ్లకుండా చర్యలు చేపట్టాలి

**అమరావతి,:** తనను కస్టడీలో హింసించిన కేసులో సుప్రీంకోర్టు విచారణ పై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా రేణిగుంట విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఐడీ విచారణ పారదర్శకంగా సాగుతుందని చెప్పారు. తనపై దాడి చేసిన అధికారులు అరెస్ట్ అయ్యారు. త్వరలో మరికొందరూ అరెస్ట్ అవుతారని పేర్కొన్నారు. విజయ్ పాల్ నన్ను అక్రమంగా అరెస్ట్ చేసి దురుసుగా ప్రవర్తించారు. కోర్టులో వాస్తవాలు బయటపడుతున్నాయి. అప్పటి సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ తన ప్రైవేట్ సిబ్బంది తో తనపై దాడి చేయించారని తెలిపారు. అతి త్వరలోనే ఆ వివరాలు అన్ని కూడా బయటికి వస్తాయని వెల్లడించారు. సునీల్ కుమార్ రాష్ట్రం, దేశం విడిచి వెళ్లకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని మీడియాతో రఘురామ కృష్ణంరాజు తెలిపారు.

## ప్రజల ఐక్యతే అతి పెద్ద ఆయుధం : హేమంత్ సోరెన్

రాంచీ : రాష్ట్ర ప్రజల ఐక్యత అతిపెద్ద ఆయుధమని, ఎవ్వరూ విడదీయలేరని, అణచివేయలేరని జెఎంఎం అధ్యక్షుడు హేమంత్ సోరెన్ గురువారం పేర్కొన్నారు. విప్లవాన్ని ఎంతగా అణచివేస్తే.. అంతకన్నా వేగంగా ఉవ్వెత్తున ఎగసిపడుతుందని పరోక్షంగా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. "మనల్ని నిశ్శబ్దం చేయాలని చూసినప్పుడల్లా.. మన తిరుగుబాటు, విప్లవాల స్వరం పెరుగుతుంది. ఎందుకంటే జార?ండీలు ఎవరికీ తలవంచరు. చివరి వరకు పోరాటం కొనసాగిస్తారు " అని అన్నారు. "ఈ రోజు చారిత్రాత్మకం. ఇది మనందరి సమిష్టి పోరాటం ఫలితమని ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వపరిపాలన (అబువా ప్రభుత్వం) కోసం ప్రజలను అభినందిస్తూ.. జార?ండ్ ఎల్లప్పుడూ ఆందోళనలు, పోరాటలకు జన్మనిస్తుందని అన్నారు. భగవాన్ బిర్సా ముండా, సిదో-కన్హు వంటి ప్రముఖ వీరుల వారసత్వాన్ని భుజాన వేసుకుని జెఎంఎం ప్రతి రోజూ ముందుకు సాగుతుందని అన్నారు. గురువారం సాయంత్రం 4.00 గంటలకు హేమంత్ సోరెన్ వరుసగా నాలుగవ సారి జార?ండ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. రాంచీలోని మోరాబాది గ్రౌండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు నేతలు హాజరుకానున్నారు

## బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ



న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో అత్యాచారాలు పెరిగిపోయాయి. ఈ ఘోరాల్లోనే కాదు.. బాల్య వివాహాల్లోనూ ఏపీ టాప్‌లో వుండటమే ఆందోళన కలిగించే విషయం. దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఏపీ ఒకటి. పశ్చిమ బెంగాల్, బీహార్, జార?ండ్, రాజస్థాన్, త్రిపుర, అస్సాం, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలతోపాటు, దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా ఉందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో వివాహ వయసు కంటే ఇంకా తక్కువ వయసులోనే పెళ్లిళ్లు జరుగుతున్నాయని కేంద్ర మహిళా శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణాదేవి వెల్లడించారు. దాదాపు ఐదుగురిలో ఒక అమ్మాయికి వివాహ వయసు కంటే ముందే పెళ్లి జరుగుతున్నట్లు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బుధవారం జరిగిన 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచార ప్రారంభ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. 'దేశంలో బాల్య వివాహాలను తగ్గించేందుకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చర్యలు తీసుకోవాలి. 2029 నాటికి బాల్యవివాహాల రేటు 5 శాతానికి తగ్గించేలా రాష్ట్రాలు ప్రణాళికలు రూపొందించాలి. ఆ లక్ష్యం కోసం కృషి చేయాలి. ప్రతి ఐదుగురు బాలికల్లో ఒకరికి 18 ఏళ్లలోపే వివాహం జరుగుతున్నది. బాల్య వివాహాలు అత్యంత తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనల్లో ఒకటి. చట్ట ప్రకారం నేరం కూడా. మన దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టం ఉంది. అయితే చట్టాలు మాత్రమే ఈ నేరాల్ని ఆపలేవు. సమాజంలో బాల్య వివాహాలపై అవగాహన పెంచేందుకు మనవంతుగా కృషి చేయాలి. ప్రపంచంలోనే దక్షిణాసియాలో బాల్య వివాహాల రేటు తక్కువగా ఉంది. గతేడాది దాదాపు రెండు లక్షల బాల్య వివాహాలు నిరోధించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం దక్షిణాసియాలోనే బాల్యల వివాహాల రేటు తక్కువగా ఉంది. ఈ విజయంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది' అని ఆమె అన్నారు. బాల్య వివాహాలను నిరోధించడంలో భాగంగానే 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ క్యాంపెయిన్ ప్రధాన ఉద్దేశం బాల్య వివాహాలను నిరోధించడం, వీటిపై అవగాహన పెంచడానికి, ఈ కేసులను మోనిటర్ చేయడానికి పురోగతి సాధించేందుకే ప్రారంభిస్తున్నట్లు అన్నపూర్ణాదేవి వెల్లడించారు. భారత్ బాల్య వివాహాల విముక్తి దేశంగా ఉండాలని, దీనికి పౌరుల భాగస్వామ్యం కీలకమని ఆమె అన్నారు.

## లోక్‌సభ ఎంపిగా ప్రియాంక గాంధీ ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభ ఎంపిగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ గురువారం ప్రమాణం చేశారు. రాజ్యసభ ఎంపి, తన తల్లి సోనియాగాంధీతో పాటు ఆమె మొదటిసారి పార్లమెంటులోకి అడుగుపెట్టారు. అనంతరం 'ప్రియాంక గాంధీ అను నేను' అంటూ ఎంపిగా ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా ఇతర నేతలు ఆమెతో పాటు ఉన్నారు. అనంతరం తాను చాలా సంతోషంగా ఉన్నానని మీడియాతో అన్నారు. ఇటీవల జరిగిన వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో ప్రియాంక గాంధీ ప్రత్యర్థిపై 4,10,931 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన సంగతి తెలిసిందే.ం

## 'ప్రత్యేకహోదా'పై హైకోర్టు వ్యాఖ్య దురదృష్టకరం




విజయవాడ : ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకహోదా ఇచ్చే విషయంలో హైకోర్టులో దాఖలైన పిల్ పై బెంచ్ స్పందిస్తూ రాతపూర్వకమైన హామీ లేనందున దీనిపై వ్యాజ్యంగా తీసుకోలేమని చెప్పటం న్యాయం కాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్లమెంట్లో ప్రధాని చేసిన ప్రకటనకు విలువ లేదని కేంద్రం వాదించటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయటమేనని ఆగ్రహించారు. ఆనాడు వామపక్ష ఎంపీలతో పాటు బిజెపి సభ్యులు కూడా ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేశారని గుర్తు చేశారు. నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ప్రత్యేక హోదాపై పార్లమెంటులో రాత పూర్వకమైన ప్రకటన కూడా చేశారని తెలిపారు. నాడు రాతపూర్వక హామీ ఇవ్వలేదు కాబట్టి దానికి విలువ లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పటం ముమ్మాటికి విద్రోహమేనని మండిపడ్డారు. దీన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని ప్రకటించారు. తక్షణం ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

### దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ చట్టం చేయాలి

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తిస్తూ చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మతం మారినంత మాత్రాన కుల వివక్ష పోలేదని, అంటరానితనం కొనసాగుతూనే ఉందని, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో దళితులకు కల్పించిన మౌలిక హక్కులను మతంతో నిమిత్తం కాకుండా అందరికి వర్తించేలా చట్టాన్ని సవరించాలని శ్రీనివాసరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ం

## మరో మూడు రోజులు తమిళనాడు భారీ వర్షాలు



చెన్నై: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తమిళనాడు తీర ప్రాంతాల్లో ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈరోజు చెన్నైతో సహా వివిధ తీరప్రాంత జిల్లాలకు భారీ నుండి అతి భారీ తీవ్రతతో కూడిన వర్షపాతాన్ని సూచించే ఆరెంజ్, పసుపు హెచ్చరికలను జారీ చేసింది. డలూరు, మైలదుత్తురై జిల్లాల్లో గురువారం ఉదయం 8.30 గంటల వరకు 24.4 సెం.మీ కంటే ఎక్కువ తీవ్ర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కాంచీపురం, కడలూరు, చెంగల్‌పట్టు, విల్లుపురం, పుదుచ్చేరిలలో 24 సెంటీమీటర్ల వరకు తీవ్ర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట, తిరువారూరు, నాగపట్నం సహా మరో పన్నెండు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. ఈరోజు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ తీర ప్రాంతాలలో గంటకు 65 కి.మీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నవంబర్ 29 నుండి డిసెంబర్ 2 వరకు తమిళనాడు కోస్తా ప్రాంతం, ఉత్తర ప్రాంతంలో ఇదే విధమైన వర్షపాతం ఉంటుందని పేర్కొన్నారు.ం

## రామ్మూర్తి నాయుడు కర్మక్రియల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు



తిరుపతి టౌన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న రాష్ట్ర మంత్రులు వ్యవసాయ, రెవిన్యూ శాఖ కె.అచ్చెన్ననాయుడు, అనగాని సత్యప్రసాద్, శాసనసభ్యులు పలమనేరు, పీలేరు, పూతలపట్టు, చంద్రగిరి, సత్యవేడు, పొన్నూరు దూళిపాళ్ళ నరేంద్ర, పులిపర్తి నాని, ఎన్ అమరనాథ్ రెడ్డి, ఎస్.కిషోర్ కుమార్ రెడ్డి, మురళీమోహన్, ఆదిమూలం చిత్తూరు మాజీ ఎం ఎల్ సి దొరబాబు కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి మరియు కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ బెదిరింపుల అనంతరం మెక్సికో కీలక నిర్ణయం

### అక్రమ వలసలపై కఠిన చర్యలకు అంగీకారం



వాషింగ్టన్ : అక్రమ వలసదారులను అడ్డుకునేందుకు మెక్సికో అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యునైటెడ్ స్టేట్స్‌లోకి అక్రమ వలసదారుల ప్రవాహాన్ని ఆపడంలో విఫలమైనందుకు మెక్సికో, కెనడా నుండి వచ్చే అన్ని దిగుమతులపై 25 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ బెదిరింపులకు దిగిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఈ విషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో పోస్ట్ ద్వారా తెలియజేశారు. అక్రమ వలసదారులకు సంబంధించి తాను మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌తో ఫోన్‌లో మాట్లాడానని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలోకి డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టేందుకు, ఈ డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ఏం చేయాలనే విషయమై ఇద్దరూ మాట్లాడుకున్నారని ట్రంప్ తెలిపారు. "మా దక్షిణ సరిహద్దులోకి ప్రజలు ప్రవేశించకుండా మెక్సికో అడ్డుకుంటుంది. ఇది తక్షణమే అమలులోకి వస్తుంది. ఇది అమెరికా(యుఎస్ఎ)లోకి అక్రమ వలసలను ఆపడానికి చాలా దోహదపడుతుంది. ధన్యవాదాలు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కెనడా, మెక్సికో నుండి దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై జనవరి 20న సంతకం చేస్తానని ట్రంప్ చెప్పారు. తాను అధికారం చేపట్టిన తర్వాత చేసే పనులలో ఇదొకటని తెలిపారు.

# విద్వేషం విభజన రాజకీయం




దేశమంతా రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. భారత రాజ్యాంగ ఔన్నత్యాన్ని రాష్ట్రపతి, ప్రధాని మొదలు భారతావని యావత్తూ గుర్తు చేసుకొని గర్వంతో పులకించిపోయింది. రాజ్యాంగం దృష్టిలో ప్రజలంతా సమానులే. కానీ నేడు దేశంలో జరుగుతున్నదేమిటి? మతోన్మాదం జడలు విప్పి మైనారిటీలను అభద్రతాభావంలోకి నెట్టేస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రే ఎన్నికల ప్రచారాలలో విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ విభజన రాజకీయాలకు తెర తీస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశాన్ని మత ప్రాతిపదికన విభజించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మానవ హక్కుల కార్యకర్త రామ్ పునియని 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌కు అందించిన విశ్లేషణాత్మక కథనం

న్యూఢిల్లీ: మైనారిటీలను కించపరచడానికి, వారిని ద్రోహులుగా చిత్రీకరించడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ, వాటి అనుబంధ సంస్థలు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకుంటున్నాయి. ఈ సంస్థల నేతలు తమ ప్రసంగాలలో మైనారిటీలపై విషం చిమ్ముతుంటారు. విద్వేష ప్రసంగాలు చేసే వారిని చట్ట ప్రకారం శిక్షించవచ్చు. అయితే వారిలో చాలా మంది ఆ శిక్షల నుండి తప్పించుకుంటూనే ఉన్నారు. గత దశాబ్ద కాలంగా దేశంలో మతతత్వ పార్టీ అధికారంలో ఉండడంతో మైనారిటీలను ద్వేషించే సంస్కృతి ప్రబలిపోయింది. ముఖ్యంగా వాట్సప్ గ్రూపులలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. వీటి కారణంగా సమాజంలో సోదరభావం దెబ్బతింటోంది. చివరికి శరణార్థి శిబిరాలలో తలదాచుకుంటున్న ముస్లింలను కించపరుస్తూ 'అవి పిల్లలను కనే ఫ్యాక్టరీలు' అని తూలనాడే వరకూ వెళ్లారు. 'ధరించే దుస్తులను బట్టి వారిని గుర్తించవచ్చు. వాళ్లు మన పవిత్ర గోమాతను వధించే హంతకులు. మన బాలికలు, మహిళలను లవ్ జిహాద్ పేరుతో ఆకర్షిస్తున్నారు'.ఇవన్నీ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని చేస్తున్న వ్యాఖ్యలే. ఈ జిహాద్ సిరీస్‌లో తాజాగా ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ అనే పదాలు కూడా కలిశాయి.

ఎన్నికల ప్రచారంలో

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నరేంద్ర మోడీ డజన్ల కొద్దీ విద్వేష ప్రసంగాలు చేశారు. ఆ ఎన్నికల్లో మోడీ 110 ద్వేషపూరిత ప్రసంగాలు చేశారని హ్యూమన్ రైట్స్ వాచ్ అనే సంస్థ తెలిపింది. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి మోడీ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం ద్వారా మెజారిటీ హిందూ సమాజంలో భయాందోళనలు రేకెత్తించారని ఆ సంస్థ తన నివేదికలో చెప్పింది. ఇక్కడ మరో ఉదాహరణను చూద్దాం. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మోడీ ప్రస్తావిస్తూ అవి కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు హామీలు అని ఎద్దేవా చేశారు. 'భారత్‌ను ఇస్లామీకరణ చేసేందుకు, దేశాన్ని విభజన దిశగా నడిపేందుకు జరుగుతున్న నీచ ప్రయత్నాలలో ఇది ఓ భాగం. యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఆ సమయంలో కూడా కొన్ని ప్రయత్నాలు చేసింది. దీనిపై బీజేపీ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించింది. అది జస్టిస్ వర్మ కమిటీ నివేదిక కానీండి లేదా సచార్ కమిటీ నివేదిక కానీండి. అవన్నీ ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీల రిజర్వేషన్లను లూటీ చేసేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే' అని మోడీ చెప్పుకొచ్చారు.

జార?ండ్‌లోనూ

ఇటీవల జరిగిన జార?ండ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఈ మతోన్మాద ధోరణి మరోసారి బయటపడింది. జార?ండ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన బీజేపీ నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ రాష్ట్రంలోని ముస్లింలను చొరబాటుదారులుగా చిత్రీకరించారు. ఎన్నికల సమయంలో ముస్లింలను కించపరిచేలా బీజేపీ ఓ అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చింది. ఓ పెద్ద ముస్లిం కుటుంబం హిందువుల ఇంటిపై దాడి చేసి, దానిని ఆక్రమించినట్లు అందులో చూపారు. వాస్తవానికి జార?ండ్‌కు అంతర్జాతీయ సరిహద్దు ఏదీ లేదు. అలాంటప్పుడు హిందువుల ఇంటిని ఆక్రమించుకున్న ఆ ముస్లింలు ఎవరు? ఈ ఎన్నికల ప్రకటనపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఎలక్షన్ కమిషన్ దానిపై ఆంక్షలు విధించింది. కానీ దాని లక్ష్యం అప్పటికే నెరవేరింది. ఆ ప్రకటనకు సంబంధించిన వీడియో అనేక ప్రాంతాలలో అందుబాటులోకి వచ్చింది. జార?ండ్‌లో మరో విద్వేష ప్రచారానికి కూడా తెర లేపారు. ముస్లింలు ఆదివాసీలను వివాహం చేసుకుంటారని, వారి భూములు స్వాధీనం చేసుకుంటారని తప్పుడు ప్రచారం చేశారు. అయితే ఈ వాదనకు మద్దతుగా ఎలాంటి ఆధారాలు, గణాంకాలు చూపలేకపోయారు. అది కేవలం విభజన రాజకీయాలకు మాత్రమే ఉద్దేశించిన ప్రచారం. 'మీ రోటీని, బేటీని, మట్టిని ముస్లిం చొరబాటుదారులు లాగేసుకుంటారు' అనే నినాదాన్ని ప్రచారంలో పెట్టారు. ఈ ప్రకటన వచ్చింది వేరెవరి నుండో కాదు. సాక్షాత్తూ ఈ దేశ ప్రధాని మోడీ నుండే.

ముస్లింలపై వ్యతిరేకత నూరిపోస్తూ

బీజేపీకే చెందిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ల్యాండ్ జిహాద్, ఓట్ జిహాద్ పైన దృష్టి సారించడంతో సరిపెట్టుకోకుండా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అర్బన్ నక్సల్స్, ఆల్ట్రా లెఫ్ట్ భాగస్వాములయ్యాయని నిందించారు. ఈ దుష్ప్రచార ప్రభావం హిందూ సమీకరణ విషయంలో కాకుండా దాని ద్వారా ఓటింగ్ సరళిలో కూడా కన్పిస్తోంది. ఇప్పుడు హిందూ కుటుంబాలలో వేలాది వాట్సప్ గ్రూపులు విషాన్ని తలకెక్కిస్తున్నాయి. సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ (సీఎస్‌డీఎస్) అనే సంస్థ ఈ ఏడాది మార్చి 28 నుండి ఏప్రిల్ వరకూ ఓ అధ్యయనాన్ని నిర్వహించింది. హిందువులు ముస్లింలను ఎలా చూస్తున్నారో తెలుసుకునేం దుకు అందులో ప్రయత్నించింది. ముస్లింల విష యంలో హిందువుల్లో నెలకొన్న దురభిప్రాయం ఆ అధ్య యనంలో తేట తెల్లమైంది. మన సమాజంలో కూడా ఇదే అభి ప్రాయం నెలకొన్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆ మాటే ఎత్తరట

బీజేపీ, మోడీ మాత్రం తాము ముస్లింలకు వ్యతిరేకం కాదని నమ్మించేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎన్నికల్లో మీరు ముస్లిం వ్యతిరేక ప్రచారం చేశారు కదా అని పాత్రికేయులు అడిగిన ప్రశ్న లకు మోడీ బదులిస్తూ 'రాజకీయాల్లో హిందూ-ముస్లిం గురించి మాట్లాడే మొదటి రోజు నుండే నేను ప్రజా జీవి తానికి అనర్హుడిని అవుతాను. హిందూ- ముస్లిం అనే మాటే ఎత్తను. అది నా సంకల్పం' అని చెప్పారు. మాటలకు, చేతలకు మధ్య ఎంత వ్యత్యాసం ఉంటుందో ఇక్కడ కన్పిస్తోంది. ఏదేమైనా విద్వేషం ఒకవైపు వెలివేతకు దారితీస్తుంటే మరోవైపు ముస్లిం సమాజాన్ని రెండో తరగతి పౌరసత్వం వైపు నెడుతోంది.

విడిపోతే వధిస్తారు

ఈసారి బీజేపీకి చెందిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నుండి ఓ నినాదం వెలువడింది. అదేమిటంటే 'మనం విడిపోతే మనల్ని వధిస్తారు'. హిందువుల ఐక్యతను దృష్టిలో పెట్టుకొని ఆయన ఈ వ్యాఖ్య చేశారు. యోగి వ్యాఖ్యను బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ సమర్థించింది. ఆ సంస్థకు చెందిన దత్తాత్రేయ హొసాబలే మాట్లాడుతూ 'ముఖ్యమైన విషయమేమిటంటే హిందువులు సంఘటితంగా ఉంటే అది అందరికీ ప్రయోజనకరం. హిందువుల ఐక్యత అనేది సంఘ్ జీవితకాల ప్రతిజ్ఞ' అని స్పష్టం చేశారు. ఆదిత్యనాథ్ ప్రకటనను ప్రధాని మోడీ కొంచెం సవరిస్తూ 'హిందువులు ఐక్యంగా ఉంటే సురక్షితంగా ఉంటారు' అని అన్నారు. మైనారిటీల కారణంగా హిందువులు ప్రమాదంలో ఉన్నందున వారిని సురక్షితంగా ఉంచాలంటే హిందూ ఐక్యతే పునాది అని చాటిచెప్పడమే బీజేపీ నేతల ఉద్దేశమని అర్థమవుతోంది.

# మూలాల్లోకి వెళ్లాలి



పుండెక్కడుందో.. మందక్కడే వేయాలంటారు పెద్దలు. అప్పుడే అది తగ్గుతుంది. ఈపని చేయకపోవటం వల్లే రాష్ట్రంలో ఇప్పుడు ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతమవుతున్నాయి. ఫలి తంగా విద్యార్థులు బలైపోతున్నారు. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు మధ్యాహ్న భోజనం వికటించింది. మొత్తం ఎనభై మంది పిల్లలు ఆస్పత్రి పాలయ్యారు. ఇలాంటి ఘటనలే రాష్ట్రంలోని పలు గురుకులాల్లో ఇటీవల చోటు చేసుకోవటం ఆందోళనాకరం. మాగనూరు పాఠశాలకు సంబంధించి మొదటి ఘటన అశ్రద్ధ, నిర్లక్ష్యం వల్లే సంభవించిందని చెప్పక తప్పదు. పౌర సరఫరాలశాఖ సరఫరా చేసిన బియ్యాన్ని బాగు చేయకుండా (గ్రేడింగ్) నేరుగా వండితే పురుగులు రాకుండా ఇంకేం వస్తాయంటూ ప్రశ్నిస్తున్నారు ఆహార నిపుణులు. అందువల్ల ఆ ఒక్క పాఠశాలే కాదు తెలంగాణలోని మిగతా బడుల్లోని ఉపాధ్యాయులు, సిబ్బంది సైతం పిల్లలకు పెట్టే భోజనం విషయంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది. ఇదే సమయంలో అదే పాఠశాలలో సోమవారం నాటి ఘటనపై విచారణకు వెళ్లిన స్థానిక తహశీల్దార్, అక్కడి ఉపాధ్యాయులు కూడా వాస్తవాలను తెలుసుకునేందుకు వీలుగా విద్యార్థులకు వడ్డించిన భోజనాన్నే తినటాన్ని మనం అభినందించాల్సిందే. ఇదే శ్రద్ధ, చొరవతో అప్రమత్తంగా ఉండటం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అటు ప్రభుత్వానిది, ఇటు ఉపాధ్యాయులది కూడా. ఇక గురుకులాల విషయానికొస్తే గత ప్రభుత్వ విధానపరమైన లోపాలు, నిర్ణయాలు నేటి రేవంత్ సర్కారుకు శాపాలుగా మారాయి. బీఆర్ఎస్ సర్కారు హడావుడిగా, అనాలోచితంగా ప్రారం భించిన గురుకులాల్లో అత్యధికం అద్దెభవనాల్లో కొనసాగుతుండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,022 గురుకులాలు ఉంటే వాటిలో సగానికి పైగా అంటే 660 అద్దె భవనాల్లోనే ఉన్నాయి. వీటిలో వంటశాలలు, బియ్యం, కూర గాయలు, ఇతర సామగ్రి భద్రపరుచుకు నేందుకు ప్రత్యేకంగా స్టోర్ రూమ్‌లంటూ ఏమీ లేవు. దీంతో అవన్నీ పాడైపోతున్నాయం టున్నారు అక్కడి సిబ్బంది. దీనికితోడు వంటల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కేర్ టేకర్లుగానీ, వార్డెన్లు గానీ లేకపోవటం విద్యార్థులకు శాపంగా మారింది. ఫలితంగా పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులే ఇటు వంటలను, అటు బోధనను చూసు కోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో రెండింటిలో ఏఒక్క దానిమీద కూడా పూర్తి శ్రద్ధను పెట్టలేకపోతున్నా మని వాపోతున్నారు టీచర్లు. అంతిమంగా ఇది విద్యా ప్రమాణాల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోందని తేలింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖను స్వయంగా ముఖ్యమంత్రి రేవంతే పర్యవేక్షిస్తోన్న నేపథ్యంలో ఆయన భుజాలపై ఇప్పుడు బృహత్తర బాధ్యత ఉంది. ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన దరిమిలా%ూ% సీఎం నేరుగా రంగంలోకి దిగి, సమస్యలకు గల మూల కారణాలను వెతకాలి. వాటి మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలి. గురకులాలు, ప్రభుత్వ బడుల్లో చదువుకునే పిల్లలందరూ పేదలు, బలహీనవర్గాలకు చెందిన వారు కాబట్టి, వారికి సమయానికి మధ్యాహ్న భోజనాన్ని అందించటమేగాదు, అది నాణ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా సర్కారుదే. నేటి బాలలే రేపటి పౌరులు వారు చదువులు, ఆటపాటల్లో రాణించాలంటే పౌష్టికాహారం అవసరం. అది లేకే వందలాది మంది పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని సర్కారు గుర్తెరగాలి. ప్రభుత్వ బడులపై పకడ్బందీ పర్యవేక్షణ ఉండేలా చేయటం ద్వారా ఈ సమస్యల నుంచి విద్యార్థులను బయటపడేయొచ్చు. అందుకోసం విద్యా రంగానికి చాలినన్ని నిధులు కేటాయించాలి. సొంత భవనాలు నిర్మించాలి, సరిపడా సిబ్బందిని నియమించాలి. ఆ దిశగా సర్కారు ప్రయత్నాలు ప్రారంభించాలి. లేదంటే మాగనూరు లాంటి ఘటనలు మరిన్ని పునరావృతమయ్యే అవకాశం లేకపోలేదు.

# ఆకలి కేకల ప్రపంచం



దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని చెప్పే పాలకులకు పేదల ఆకలికేకలు కనిపించవు. ఆర్తనాదాలు వినిపించవు. ఎవరికి వారు తమది పేద దేశం కాదని, ప్రపంచంలోనే ధనిక దేశాలతో పోటీపడుతున్నామని చెబుతున్నవారి డొల్లతనాన్ని తాజాగా ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నివేదిక బయటపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 731 నుంచి 757 మిలియన్ల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, ప్రతి 11 మందిలో ఒక్కరు ఆకలి వలయంలో చిక్కి బక్కపడుతున్నారని పేర్కొంది. ఐరాస ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన "స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ 2024 (ఎస్ఓఎఫ్ఐ-2024)" నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం చూస్తే ఆహార అభద్రత, పోషకాహార లోపాలు ప్రపంచ మానవాళిని వెంటాడుతున్నాయి. ఆసియా ఖండంలోనే అత్యధిక పోషకాహార లోపంతో బాధపడుతున్న ప్రజలున్నారు. 2023లో దాదాపు 2.33 బిలియన్ల ప్రపంచ ప్రజలు సాధారణ లేదా తీవ్రమైన ఆహార అభద్రతలో బతుకులు ఈడుస్తున్నారు. తీవ్రమైన ఆహార అభద్రతలో 864 మిలియన్ల ప్రపంచ ప్రజలున్నారు. ప్రతి ఒక్కరికి రోజుకు సగటున దాదాపు 3.96 డాలర్లు ఆరోగ్యకర భోజన ఖర్చులవుతున్నాయి. దీంతో 55.6 శాతం భారతీయులు ఆరోగ్యకర భోజనాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. ఐదేండ్లలోపు పిల్లల్లో స్టంటింగ్, వేస్టింగ్ సమస్యలు తగ్గినా, ప్రపంచవ్యాప్తం స్థూలకాయ సమస్యలు పెరుగుతున్నాయి. 15నుంచి 40 ఏండ్ల లోపు మహిళల్లో రక్తహీనత పెరుగుతూ ప్రజారోగ్యం పెద్దసమస్యగా ముందుకొస్తున్నది. ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 194.6 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపాలతో జీవిస్తున్నారు. దీర్ఘ కాలం పాటు ఆహార అభద్రత సమస్యలతో సతమతమవుతూ 13 శాతం ప్రజలు తీవ్రమైన పోషకాహార లోప సమస్యలతో బాధపడుతున్నారు. "2023 ప్రపంచ ఆకలి సూచీ" జాబితాలో భారత్ 111వ స్థానానికి దిగజారడం మన దుస్థితులను వివరిస్తున్నది. దక్షిణాసియా దేశాల్లో ఇండియాలోనే అత్యధికంగా 18.7 శాతం వేస్టింగ్, అధికంగా 31.7 శాతం స్టంటింగ్ సమస్యలు పిల్లలకు ఎదురవుతున్నట్టు నివేదిక ద్వారా తెలిసింది. పోషకాహారలోపం కలిగిన తల్లుల వల్ల 27.4 శాతం శిశువులు తక్కువ బరువుతో పుడుతున్నారని, ఇది ప్రపంచంలోనే అత్యధికమని వెల్లడైంది. భారతీయ మహిళల్లో 53 శాతం రక్తహీనత, 2.8 శాతం పిల్లల్లో/7.3 శాతం పెద్దల్లో స్థూలకాయం నమోదుకావడం ఆందోళనకరమైన అంశం. కోవిడ్-19 సమయంలో ఆదాయం పడిపోవడం, జీవనోపాధులు తగ్గడం, ఆహార సరఫరా శృంఖలం గాడి తప్పడంతో ఆహార అభద్రత, పోషకాహారలోపం పెరిగిన మాట వాస్తవం. ఎస్ఓఎఫ్ఐ-2024 థీమ్‌గా "ఆకలి, ఆహార అభద్రత, పోషకాహారలోపాలను అంతం చేయడానికి ఆర్థిక పెట్టుబడులు కావాలి" అనబడే అంశాన్ని తీసుకుంది. ఈ లక్ష్యంతో వ్యవసాయ ఆధార పరిశ్రమల ఏర్పాటు లేదా బలోపేతం చేయడం, అసమానతల తొలగింపు, ఆహార భద్రతను గాడిలో పెట్టడం, పోషకాహార లభ్యతకు వనరుల కల్పన లాంటివి ఫలిస్తాయనే ఆశిస్తున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి చేరడానికి కావలసిన ఆర్థిక వనరులను ఆయా ప్రభుత్వాలు ప్రాధాన్యతాక్రమంలో కేటాయించాలని, 2030 నాటికి ఆకలి కేకలు వినిపించరాదని ఐరాస కోరుకుంటున్నది.

# ఏపీలో భారీ వర్ష సూచన



అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో శనివారం ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల వెంబడి కారైకాల్, మహాబలిపురం మధ్య తీవ్ర వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో మూడు రోజులు (28, 29, 30) దక్షిణకోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు, రాయలసీమలో శుక్ర, శనివారాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. దక్షిణకోస్తా తీరం వెంబడి గంటకు 35-45 కి.మీ గరిష్టంగా 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

# త్వరలో సాగునీటి, సహకార ఎన్నికలు



అమరావతి : రాష్ట్రంలో త్వరలో సాగునీటి, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. . పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కూడా టిడిపి కూటమి అభ్యర్థులే గెలుపొందేలా కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఇప్పటికే 52.45 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని ఆయన చప్పారు. ఇంత స్వల్ప కాలంలోనే ఇంతమంది చేరడం ఒక చర్తిర అని అన్నారు. గత ఎన్నికల పోలింగ్‌లో రాజంపేట, కుప్పం, కళ్యాణదుర్గం, పాలకొల్లు, ఆత్మకూరు, మంగళగిరి, కనిగిరి, కోడూరు, వినుకొండ, కావలి నియోజకవర్గాలు మొదటి పది స్థానాల్లో నిలిచాయని అక్కడి నాయకత్వాన్ని అభినందించారు. సభ్యత్వాల నమోదుపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని లక్ష్యం దిశగా తీసుకెళు న్నారని మంత్రి లోకేష్‌ను అభినందించారు. తొలిసారిగా రూ.1లక్షతో తీసుకొచ్చిన శాశ్వత సభ్యత్వ విధానానికి కూడా అనూహ్యమైన స్పందన వస్తోందని చెప్పారు. గత ఐదేళ్లల్లో విచ్చలవిడితనంతో ఎక్కడికక్కడ భూ సమస్యలు సృష్టించారని, త్వరలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి వీటిని పరిష్కరిస్తామన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.1400కోట్లు మంజూరు చేశామని, సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా రోడ్లపై గుంతల్లేకుండా చేస్తామని తెలిపారు.

## అణ్వాయుధ దాడికి పుతిన్ ఆదేశం.. ప్రపంచదేశాల ఆందోళన



మాస్కో: ప్రపంచమంతా ఎంతగానో భయపడుతున్నట్లే రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన అణు క్షిపణి సాతాన్-2ను ఉక్రెయిన్‌పై ప్రయోగించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ తొలిసారిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా భయాందోళనలు నెలకొన్నాయి. ఉక్రెయిన్‌కు అణ్వాయుధాలు అందించడం గురించి పశ్చిమ దేశాలు యోచిస్తున్న సమయంలో పుతిన్ నుంచి ఈ ఆదేశాలు వెలువడటం గమనార్హం. రష్యాలో రూపొందిన సాతాన్-2 క్షిపణి ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అణు క్షిపణి. దీనికి ఏకకాలంలో డజన్ల కొద్దీ అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం ఉంది. ఈ అణు క్షిపణి బరువు 208.1 టన్నులు. ఇది 10 టన్నుల వరకు పేలోడ్‌ను మోయగలదు. దీని స్ట్రైక్ రేంజ్ 35 వేల కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఈ వివరాల ఆధారంగా ఈ క్షిపణి ఎంత ప్రమాదకరమో ఇట్టే ఊహించుకోవచ్చు. రష్యా ఇప్పుడు ఈ క్షిపణికి ఆర్ఎస్-28 సర్మత్ అనే పేరు పెట్టింది. ప్రపంచదేశాలు దీనిని సాతాన్-2 పేరుతో పిలుస్తున్నాయి. దీనిని రష్యా విజయవంతంగా పరీక్షించిన తర్వాత, 2023లో దీనిని సైన్యంలో చేర్చింది. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన తర్వాత రష్యా ఈ క్షిపణిని పరీక్షించింది. ఈ క్షిపణిని ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేశారు.

## మహారాష్ట్ర కేబినెట్..
## బీజేపీ, శివసేన, ఎన్సీపీకి ఎన్ని బెర్తులంటే..!



ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై ఉత్కంఠ వీడినట్లే కనిపిస్తోంది. శివసేన నేత ఏక్‌నాథ్ షిండే వెనక్కి తగ్గడంతో ముఖ్యమంత్రి పదవి బీజేపీకే దక్కడం ఖాయమని తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఎంపిక, ప్రభుత్వ ఏర్పాటు విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే ఫైనల్ అని షిండే ప్రకటించడంతో.. ఇక ఫడ్నవీస్ సీఎం అవడం ఖరారైనట్లు సమాచారం. ఈ క్రమంలో తాజాగా మహాయుతి కూటమిలోని కేబినెట్ కూర్పులోని ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర కేబినెట్‌లో గరిష్టంగా 43 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉండగా.. ముఖ్యమంత్రితో సహా మంత్రి మండలిలో సగం శాఖలను బీజేపీ తన వద్దే ఉంచుకోనున్నట్లు సమాచారం. దాదాపు 20 మంది మంత్రులకు పదవులు తీసుకునే ఛాన్స్ ఉంది. ఇక సీఎం పీఠాన్ని వదులుకున్న ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు మూడు కీలక మంత్రిత్వ శాఖలు.. పట్టణాభివృద్ధి, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, జలవనరులతోపాటు 12 కేబినెట్ బెర్తలను ఇచ్చేందుకు అవకాశం ఉందని సంబంధిత వార్గాలు తెలిపాయి. అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి మంత్రివర్గంలో తొమ్మిది శాఖలు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు శివసేన, ఎన్సీపీ నుంచి ఒక్కొక్కరు డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే నేడు(గురువారం) ఢిల్లీలో జరగబోయే మహాయుతి నేతల కీలక సమావేశంలో దీనిపై పూర్తి లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ నెల 30న గానీ, వచ్చే నెల 1నగానీ కొత్త ప్రభుత్వం కొలువుదీరే అవకాశముంది.

# సమస్యల మణిపురం - సంభావ్య పరిష్కారం




మణిపూర్ మరలా మండుతోంది. మోడీ మణిపూర్ పోలేదని విపక్షాల విమర్శ. మణిపూర్ సమస్యను తీర్చమని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాష్ట్రపతికి లేఖ రాశారు. రాజ్యాంగాధికరణలు 370, 35ఎ కశ్మీరీలకు భూమి హక్కునిచ్చాయి. వీటి రద్దుతో కశ్మీర్ భూములను కార్పొరేట్ల కిచ్చారు. లక్షద్వీప్ కేంద్ర పాలనాధికారి రాజ్యాంగ పరిమితి దాటి చట్టాలు చేశారు. ప్రకృతి సంపద, సముద్ర తీరాలు, నిర్జన ద్వీపాలను కార్పొరేట్లకు పంచారు. నేటి పాలకవర్గాల ఇలాంటి చర్యలే మణిపూర్ అల్లర్లకు కారణం. 2017లో 60 సీట్ల (40 మైతీలకు, 20 కుకీ, నాగా, జోమి గిరిజనులకు) మణిపూర్‌లో 21 సీట్ల బీజేపీ పభుత్వాన్ని ఏర్పర్చింది.వైదికవాద మెజార్టీ మైతీలను, సనమహిలను రెచ్చగొట్టి సంఘ్ సంస్థలు క్రైస్తవ కుకీలపై దాడిచేశాయి. వారితో ఆస్తులు, ఇండ్లు, పొరుగు పంచుకోవద్దని 2022 ఎన్నికల్లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ మైతీలకు చెప్పారు. వారు ఈ గుజరాత్ నమూనాను పాటించారు. కుకీలు, నాగాలు మణిపూర్ లోయలో పిల్లలను చదివిస్తారు. చిన్న పనులతో అద్దె ఇండ్లలో బతుకుతారు. సంఘ్ దాడులతో పిల్లల చదువు, పెద్దల జీవనం ఆగాయి. డబులింజిన్ ప్రభుత్వంతో శాంతిభద్రతలు, జీవన ప్రమాణాలు పెంచుతా మని, మైతీలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా ఇస్తామని మోడీ ప్రచారం చేశారు.(సామాజిక, ఆర్థిక వెనుక బాటుతో రాజకీయ ప్రాతినిధ్యం పొందలేని మూలప్రాంతాల గిరిజనులకు రాజ్యాంగం ఎస్టీ హోదానిచ్చింది. మైతీలు దీనికి అనర్హులు) రాజ్యాంగ విరుద్ధ వాగ్దానాలతో దోచుకున్న 32 సీట్లతో 2022లో ప్రభుత్వాన్ని ఏర్పర్చారు.అభివృద్ధి నిధుల్లో 80శాతం మైతీలకు, 20శాతం గిరిజనులకిచ్చారు. పాలకవర్గ మైతీలకు 36 వేర్పాటువాద తీవ్రవాద సంస్థలపై ఆంక్షలను ఎత్తేశారు. అవి విజృంభించాయి. ఎస్టీ హోదా కోసం మైతీలు ఉద్యమించారు. వారి తీవ్రవాద సంస్థలు, సంఘ్ వత్తాసు పలికాయి. దీనికి గిరిజనులు నిరసన తెలిపారు. వీరిని అడ్డుకునేందుకు మైతీలు హింసకు పాల్పడ్డారు. మణిపూర్‌లో మయన్మార్లు చొరబడ్డారని సంఘ్ ప్రచారం. నియంత్రిత ప్రాంత అనుమతితో విదేశీయులకు పదిరోజుల మణిపూర్ ప్రవేశం ఇస్తారు. అధికార అశ్రద్ధతో బర్మా చిన్ తెగవారు మణిపూర్‌లో చొరబడ్డారు. రోహింగ్య ముస్లింలను అడ్డుకున్న కేంద్రం వీరిని ఆపలేదు. బీజేపీ పాలిత గుజరాత్, రాజస్థాన్, హరియాణాలకు వైదిక విదేశీయులను రానిచ్చారు. వారికి పౌరసత్వం, ఓటు హక్కు ఇచ్చి 2014లో వారితో 19 ఎంపీ సీట్లు పొందారు. ఇదే ప్రయోజనాన్ని ఆశించి కేంద్ర రాష్ట్ర పాలకులే మణిపూర్‌లోకి బర్మీయులను రానిచ్చారు. కుకీల పర్వత ప్రాంతాల్లో బొగ్గు నిలువలున్నాయి. ఇటీవల చమురు,వజ్రాల నిక్షేపాలు కనిపెట్టారు. వాటిని కార్పొరేట్లకు ఇవ్వాలని బీజేపీ పాలకుల పన్నాగం. రక్షిత, వన్యప్రాణ అభయారణ్య అడవుల సాకుతో కుకీల భూములను ఆక్రమించారు. వారిని తరిమేశారు. కుకీలు నల్లమందు పండిస్తున్నారని వారి తోటలను ధ్వంసం చేశారు. పాలక మైతీల వాణిజ్యవేత్తలే నల్లమందు వ్యాపారం చేస్తారు. వారి డ్రగ్ సిండికేట్లు కుకీల నుండి నల్లమందును తక్కువ ధరకు కొంటారు. నల్లమందు పంటను, వ్యాపారాన్ని సొంతం చేసుకోవాలని వీరి పథకం. పోలీసులు అరెస్టుచేసిన నల్లమందు ముఠాలలో ముఖ్యమంత్రి బంధువులున్నారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికం, జాతి ద్వేషాలు కుకీలను నల్లమందు వైపునకు నెట్టాయి. పాలకులు సమస్యలను పరిష్కరిస్తే కుకీలు నల్లమందు జోలికిపోరు. మణిపూర్ క్రైస్తవ జనాభా పెరిగిందని, వారు మైతీలను మించుతారని సంఘ్ ప్రచారం. 1961-2011 మధ్య యాభైఏండ్లలో క్రైస్తవులు ఐదు లక్షలు పెరిగారు. వైదికులూ పెరిగారు. క్రమేపి పెరిగిన జనాభా, ఓట్ల కోసం పాలక ఆమోదిత వలసలు, వైదిక వివక్షను భరించలేక క్రైస్తవానికి మార్పిళ్లు పెరుగుదలకు కారణం. క్రైస్తవ పెరుగుదలను ఆపడానికి జాతీయ పౌరసత్వ, జనాభా జాబితాలను తయారుచేయమని, 1951 జనాభా ప్రకారం పౌరసత్వాన్ని సవరించమని సంఘ్ గొడవచేసింది. దీనితో 95శాతం కుకీలు, నాగాలు పౌరసత్వం కోల్పోయి రాష్ట్రాన్ని వదలాలి. అల్లర్లలో ఆరు వేల ఆయుధాలు చోరీఅయ్యాయి. పోయింది వెయ్యేనని, 200 రికవరీ చేశామని ముఖ్యమంత్రి అన్నారు. అల్లర్లు జరిగిన చురాచందపుర్‌లోనే కాక రాష్ట్రమంతా (కేంద్ర, సైనిక, ప్రత్యేక దళాల భాండాగారాలను వదిలి) రాష్ట్ర రక్షణదళాల భాండాగారాల నుంచే చోరీలు జరిగాయి. ఒక్కటీ పట్టుబడలేదు. అన్ని స్టేషన్లలో పోలీసు నిర్లిప్తత అనూహ్యం. పాలకుల, అధికారుల మద్దతుతో ఈ ఆయుధాలు సంఘ్, మైతీ సంస్థలకు చేరాయి. చనిపోయిన 250 మందిలో 98శాతం, పారిపోయిన 6,500 మందిలో 70శాతం, గాయపడ్డ 500 మంది కుకీలు. కుకీల 20వేల ఇండ్లు, 200 చర్చిలు, 17 గుళ్లు, 124 గ్రామాలు, వారి ఆస్తులు, వాహనాలే బూడిదయ్యాయి. కుకీలను తీవ్రవాదులుగా చిత్రించి పాలకులే చంపారు. 3 జూన్ 2023న కేంద్రం నియమించిన దర్యాప్తు సంస్థ గడువుతీరినా నివేదిక నివ్వలేదు. గిరిజనులు ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుతున్నారు. ఈ సందులో మయన్మార్ సైనిక ఝుంతా మణిపుర్‌లో చొరబడగలదు. స్త్రీలు, క్రీడాకళాకారులు, మేధావులు దేశవ్యాపితంగా నిరసనలు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, ఐరాస మానవహక్కుల సంస్థ, 550 మంది పౌరసమాజ ప్రతినిధులు, కేంద్ర పాలకులు జోక్యం చేసుకోవాలని, హత్యలు, హింసను, దమనకాండను ఆపాలని ఉత్తరాలు రాశారు. ప్రధాని, రాష్ట్రపతి పట్టించుకోలేదు. మోడీ మణిపూర్‌కు పోతే 'నీవిస్తానన్న ఎస్టీ హోదా ఎక్కడా?' అని నిలదీస్తారు. డబులింజిన్ డొల్లని విమర్శిస్తారు. మోడీ అక్కడికెళ్లినా నష్టమే. మణిపూర్ సమస్యకు విపక్షాలే కారణమంటారు. తాను సమస్యను పరిష్కరిస్తుంటే క్రైస్తవులు, కమ్యూనిస్టులు అడ్డుకున్నారంటారు. తన "ఘనత"ను ఘోషిస్తారు. నాలుగు వందల ఏండ్ల నాటి ముస్లిం పాలన, హిందు ఇస్లామీకరణ, క్రైస్తవీకరణలు మణిపూర్ మంటలకు మూలాలంటారు. ధృతరాష్ట్ర (వాట్సాప్) విశ్వవిద్యాలయ వత్తాసుదారులతో నమ్మిస్తారు.ప్రజాసేవకు, శ్రేయస్సుకు అంకితమవుతానని రాజ్యాంగాధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి ప్రమాణం చేశారు. గిరిజన ముర్ముకు మణిపూర్ సొంత సమస్య. వందల స్త్రీల మానప్రాణాలు పోయాయి. గిరిజనులు హత్యలు, దోపిడీలకు గురయ్యారు. మణిపూర్ గిరిజన సంక్షేమానికి కొండ ప్రాంతాలను కాపాడే రాజ్యాంగాధికరణ 371సి ఇచ్చిన ప్రత్యేక హోదాను మోడీయం దుర్లక్ష్యం చేసింది.స్త్రీలు, తన జాతి ప్రజలకు ఇన్ని అన్యాయాలు జరిగినా, మణిపూర్ ప్రజాహింసకు సైనిక ప్రత్యేకాధికారాల చట్టం తిరిగి అమలయినా సర్వసైన్యాధిపతి ముర్ము మౌనంగా ఉన్నారు.దేశ ప్రతిష్ట, లౌకికత్వం, మానవత్వాల రక్షణకు ప్రభుత్వాధిపతికి సూచనలివ్వడం దేశాధిపతి బాధ్యత. మోడీ కార్పొరేట్ ఫాసిజానికి, ఆశ్రిత కార్పొరేట్ల దోపిడీ, మోసాలకు వ్యతిరేకంగా సమాజాన్ని చైతన్యపర్చాలి.లౌకిక సమాజ అవసరాన్ని వివరించాలి.మనముందే రాజ్యవ్యవస్థ కూలింది. మన క్షేమాన్ని మనమే పట్టించుకోవాలి. సామాన్యుల సమస్యల పరిష్కారానికి పోరాడిన చారిత్రక విప్లవవీరులెందరో మనకు ఆదర్శం. వారి పోరాటాలు సమస్యల నిరోధకాలు, పరిష్కారాలు. స్వేచ్ఛాసాధికార న్యాయబద్ధ జీవితాల సాధనాలు. ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారి పద్ధతి సామాన్యుల సమస్యలు పరిష్కరించదు. మనం ఒంటరులం కాదు. సామూహికంగా సమస్యలను పరిష్కరించుకోగల ఆలోచనాపరుల సంఘ సభ్యులం. శాంతిసౌఖ్యాల ప్రపంచ నిర్మాణానికి విప్లవమార్గం పడదాం.

# కాప్ 29 తంతు




వాతావరణ మార్పుల కారణంగా తలెత్తుతున్న దుష్ప్రభావాలను తగ్గించేందుకు అజర్ బైజాన్‌లోని బాకులో జరిగిన కాప్ 29 సదస్సు ఫలవంతమైన కార్యాచరణను ప్రతిపాదించకుండానే ముగిసింది. ఈనెల 11వ తేదీన మొదలై, 22వ తేదీ వరకూ 12 రోజుల పాటు జరిపిన చర్చలు సంపన్న దేశాల స్వార్థగుణాన్ని, పర్యావరణం పట్ల వాటి పాక్షిక దృష్టిని మరోసారి బయటపెట్టాయి. తాము సృష్టిస్తున్న కాలుష్యాన్ని, కర్బన ఉద్గారాల పాపాన్ని ప్రపంచం నెత్తిన వేసి, తాము చేతులు దులుపుకోవాలన్న అతి తెలివితోనే అవి వ్యవహరించాయి. దేశాలకు సరిహద్దులు ఉంటాయి కానీ, పర్యావరణాన్ని హరించే కర్బన ఉద్గారాల వ్యాప్తికీ, వాటి పర్యవసానాలకు నియంత్రణ రేఖలు ఉండవు. ధనిక దేశాలు ఏళ్ల తరబడి అనుభవిస్తున్న సర్వ సౌఖ్యాలకు ప్రకృతి వనరులు దహించి వేసి, కీడు ఉద్గారాలను భూగోళం మీదికి వదులుతున్నాయి. ప్రపంచం మొత్తం మీద విడుదలవుతున్న కర్బన ఉద్గారాల్లో 75 శాతం వాటా ధనిక దేశాలదే! సహజ వనరుల విచ్చలవిడి వినియోగంతో తరుముకొస్తున్న ఈ ఉద్గారాల విపత్తు భూరక్షక హరిత వలయానికి చిల్లులు పెట్టి, ప్రపంచం మొత్తాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ పాపం పూర్తిగా సంపన్న దేశాలది కాగా, దాని పర్యవసానాలకు బదుగు, వర్ధమాన దేశాలు బలి కావల్సి వస్తోంది. ఈ వాస్తవాన్ని అంగీకరించటానికి, పర్యావరణ పరిరక్షణలో తదనుగుణమైన పాత్ర వహించటానికీ ధనిక దేశాలు సంపూర్ణ సంసిద్ధతను వ్యక్తం చేయటం లేదు. అందువల్ల రోజుల తరబడి సదస్సులు జరిగినా తూతూమంత్రపు తలూపులతోనే అవి తంతుగా మిగిలిపోతున్నాయి. కాప్ 29 సదస్సులో వర్ధమాన దేశాలు ఒక్కతాటిపై నిలిచి, సంపన్న దేశాల నిర్దిష్ట బాధ్యతను గుర్తు చేశాయి. 'ఎంత హరిస్తున్నారో అంత భరించాలి' అన్న న్యాయబద్ధమైన హితవుతో ఏటా 1.3 లక్షల కోట్ల డాలర్లను పర్యావరణ రక్షణకు వెచ్చించాలని కోరాయి. కానీ, ధనిక దేశాల సన్నద్ధత 30 వేల కోట్ల డాలర్ల దగ్గరే ఆగిపోయింది! ఈపాటిదానికి పన్నెండు రోజుల పాటు పర్యావరణ హితమంటూ ప్రపంచమంత రాగం తీయటం దేనికి? ఏ దేశం ఎంత కాలుష్య కారకమవుతుందో, ఏ దేశం ఎంతెంత పచ్చదనంతో ప్రపంచపు ఆరోగ్యానికి కారణమవుతుందో పక్కాగా లెక్కలను అనేక నివేదికలు ఘోషిస్తూనే ఉన్నాయి. అలాంటప్పుడు పర్యావరణ ధ్వంస సంపన్న దేశాలు హరిత సౌభాగ్యానికి తోడ్పడుతున్న వర్ధమాన దేశాలకు నిండుగా నిధులిచ్చి, ప్రోత్సహించటం అత్యంత అవసరమైన బాధ్యత. ఆ కనీస వివేచనను విడిచిపెట్టి, కొద్దిపాటి విదిలింపులతోనే సరిపెట్టటం, అదేదో తమ దాతృత్వ గుణానికి దాఖలాలా వ్యవహరించటం సబబు కాదు. పైగా ఈపాటి మాటకైనా ఆచరణ ఏమాత్రంగా ఉంటుందన్నది సందేహాస్పదమే! క్లయిమేట్ ఫైనాన్స్ కింద ఏటా 10 వేల కోట్ల డాలర్లు ఇస్తామని 2009లో సంపన్న దేశాలు ఒప్పుకున్నాయి. కానీ, గడచిన పదమూడేళ్లలో దానిని పాటించింది ఒక్కసారే! ఇలాంటి మాట తప్పుడు తంతుతో పర్యావరణానికి ఏమాత్రమూ మేలు జరగదు. ధనిక దేశాల పక్షపాత వైఖరిని, బాధ్యతారాహిత్యాన్ని వర్ధమాన దేశాలు గుర్తించి, గర్హించటం దాదాపు ప్రతి కాప్ సదస్సులోనూ జరుగుతోంది. ఈసారి కూడా తగిన మొత్తంలో పర్యావరణ నిధిని ఇవ్వాల్సిందేనని సంపన్న దేశాలను వర్ధమాన దేశాల ప్రతినిధులు నిలదీసిన ప్రతిసారీ హర్షధ్వానాలు మార్మోగాయి. "సంపన్న దేశాల వద్ద నిధులు లేక కాదుబీ అవి భౌగోళిక రాజకీయాలకు పాల్పడడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమవుతోంది" అని కొలంబియా పర్యావరణ శాఖ మంత్రి సుశానా మహ్మద్ వ్యాఖ్యానించినప్పుడు ప్రతినిధులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సదస్సు నీడన సంపన్న దేశాలు తమ వ్యాపారాలను విస్తరించుకోవటానికి అనేక ప్రతిపాదనలను, ఒప్పందాలను ముందుకు తెచ్చాయి. క్లయిమేట్ ఫైనాన్స్‌ని అంతర్జాతీయ పెట్టుబడుల వ్యూహంగా మార్చే పన్నాగాలకు పదును పెట్టాయి. కర్బన ఉద్గారాలను తగ్గించే ప్రాజెక్టులకు పెట్టుబడులు పెడతామంటూ కార్పొరేటు దిగ్గజాలు బరిలోకి దిగటం ఇందులో భాగమే! అసలు ప్రమాదాన్ని చిత్తశుద్ధితో ఎదుర్కోకుండా లాభార్జన దుర్బుద్ధితో వ్యవహరిస్తే భూగోళం మరింత రుజాగ్రస్తం అవుతుంది. ఈ ఎత్తుగడలను తుత్తనియలు చేస్తూ, సంపన్న దేశాల మెడ మీద బాధ్యతల కాడిని మోపటం వర్ధమాన దేశాల ఉమ్మడి బాధ్యత.

# మహారాష్ట్ర సీఎంగా ఆయనకే ఛాన్స్..!
# షిండే ప్రకటనతో రూట్ క్లియర్..

## ఇవాళ ఢిల్లీలో మహాయుతి భేటీ




మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కు రూట్‌క్లియర్ అయ్యింది. గురువారం మహారాష్ట్ర సీఎం పేరును బీజేపీ హైకమాండ్ ఢిల్లీలో ప్రకటించబోతోంది. మహారాష్ట్ర సీఎం ఎంపికపై గురువారం ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది.. ఈ సమావేశానికి మహాయుతి నేతలు హాజరుకానున్నారు.. %దీజీ% అగ్రనేత అమిత్ షా.. షిండే, పవార్, ఫడ్నవీస్ సమావేశం కానున్నారు. సీఎం ఎవరన్నది ఈ సమావేశం అనంతరం ప్రకటించనున్నారు.. సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండే అవకాశం ఉంది.. బీజేపీకి ఎక్కువ సీట్లు వచ్చిన నేపథ్యంలో ఈసారి సీఎం పదవి ఆ పార్టీ నేతకే వరించే ఛాన్స్ ఉంది. మహాయుతి నేతలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమావేశం కానున్నారు.. రాత్రి వినోద్ తావ్డేతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించిన అమిత్ షా.. షిండేను ముఖ్యమంత్రిగా కొనసాగించకపోతే మరాఠా సామాజిక వర్గం ఎలా స్పందిస్తుంది.. అన్న అంశంపై చర్చించారు.. ఈ నేపథ్యంలోనే..

క్లారిటీ ఇచ్చిన షిండే..

ఇదిలాఉంటే.. ముఖ్యమంత్రి రేసు నుంచి తప్పుకుంటునట్టు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు శివసేన నేత ఏక్‌నాథ్‌షిండే.. బీజేపీ ముఖ్యమంత్రి పదవి తీసుకుంటే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, నరేంద్ర మోదీ %-% అమిత్‌షా తీసుకునే నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు షిండే.. సీఎం పదవి కోసం తాను అలిగి , ఇంట్లో కూర్చునట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు ఏక్‌నాథ్ షిండే. పోరాటం తన రక్తంలోనే ఉందన్నారు. సీఎం అంటే కామన్‌మ్యాన్ అన్న భాష్యం చెప్పారు. తాను ముఖ్యమంత్రిలా ఎప్పుడు భావించలేదని, ఒక సామాన్యుడి లాగే పదవిలో కొనసాగినట్టు స్పష్టం చేశారు. ఈ విజయం తమపై ఇంకా బాధ్యతను పెంచిందని.. మహాయుతి సర్కార్, కేంద్రం కలిసి పనిచేస్తాయన్నారు. బీజేపీ అగ్రనేతలు ఏ నిర్ణయం తీసుకున్నా .. ఆ పార్టీ నుంచి సీఎంను ఎంపిక చేసినా పూర్తిగా సమర్థిస్తా అంటూ తెలిపారు.

ఫడ్నవీస్ ఏమన్నారంటే..

సీఎం పదవిపై మహాయుతి కూటమిలో ఎలంటి అభిప్రాయభేదాలు లేవని స్పష్టం చేశారు ఫడ్నవీస్.. మోదీ,అమిత్‌షా తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని షిండే చెప్పడాన్ని ఆయన స్వాగతించారు. మూడు పార్టీలు చర్చించుకొని తుదినిర్ణయం తీసుకుంటాయని చెప్పారు. ఎన్నికలకు ముందే షిండేనే సీఎం అని మహాయుతి కూటమి ప్రచారం చేసిందని, ఇప్పుడు ఇలా జరగడంపై శివసేన కార్యకర్తలు డీలా పడిపోతున్నారు. బీజేపీ 132 మంది ఎమ్మెల్యేల బలం ముందు షిండే సరెండర్ కావల్సిన పరిస్థితులు వచ్చినట్టు చెబుతున్నారు. బీజేపీ హైకమాండ్ పిలుపుతో ఫడ్నవీస్ ఢిల్లీకి చేరుకున్నారు. ఏక్‌నాథ్‌షిండే , అజిత్‌పవార్ కూడా ఢిల్లీకి చేరుకుంటున్నారు. ముగ్గురితో చర్చించిన తరువాత సీఎం పేరును బీజేపీ హైకమాండ్ ప్రకటించబోతోంది. డిసెంబర్ 2వ తేదీన ఫడ్నవీస్ ప్రమాణం చేస్తారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. సీఎంతో పాటు శివసేన నుంచి ఒకరు , ఎన్సీపీ నుంచి ఒకరు డిప్యూటీ సీఎంలుగా ప్రమాణం చేయబోతున్నారు.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com